వాస్వాని పండిత

ఆశియాఖండ విజ్ఞానరహస్యము

మద్రాసు, 1922

Vāsvāni Pandita

Āśiyākhaṇḍa Vijñānarahasyamu

Madrāsu, 1922

Record no. 705

Bibliographic Record Target

వాస్వాని పండిత.

ఆశియాఖండ విజ్ఞానరహస్యము / వాస్వాని పండిత విరచితము, ఆంగ్లమునుండి అనువాదింపఁబడినది.- మద్రాసు : ఉపేంద్ర ప్రచురణాలయము, 1922.

70 p. ;18 cm.

Record no. 705

Vāsvāni Pandita.

Āśiyākhaṇḍa Vijñānarahasyamu / Vāsvāni paṇḍita viracitamu, Āṃglamunuṇḍi anuvādimpam̐baḍinadi.- Madrāsu : Upēndra Pracuraṇālayamu, 1922.

70 p. ;18 cm.

Record no. 705

ఆశియాఖండ

విజ్ఞానరహస్యము

(వాస్వాని పండిత విరచితము)

ఆంగ్లమునుండి అనువాదింపబడినది

ఉపేంద్ర ప్రచురణాలయము.

౧౭, నారాయణ మొదలి వీధి,

మద్రాసు.

ఆశియాఖండ విజ్ఞాన రహస్యము.

(వాస్వాని పండిత విరచితము)

ఆంగ్లమునుండి అనువాదింపఁబడినది.

ఉపేంద్ర ప్రచురణాలయము

౧౭, నారాయణ మొదలి వీధి,

మద్రాసు.

ఓమ్.

ఆశియాఖండ పరిజ్ఞాన భావము.

పురాతనగ్రంథములలో "కల్చర్" అను యింగ్లీషు పదమునకు ప్రబుద్ధితమని యర్థము చెప్పబడియున్నది. హిందూదేశ, చీనా, జపాను కొరియా దేశీయులచేఁ బూజింపఁబడి, యాదేశములన్నిట మతసమ్మేళనముఁ గూర్చిన శాక్యముని బుద్ధుఁడు "కల్చర్" అను 'విజ్ఞాన' పదముయొక్క అర్థమునకు సరిపోయినవాఁడు. ఈవిజ్ఞానమనఁగా విషయమును గ్రహించుట మాత్రమే కాదు. విజ్ఞానము మనుష్యునికి మహోన్నత చర్చా పాండిత్యముఁ జేకూర్చును. మొదటినుండియు హిందూదేశమీ విజ్ఞానమునే యుపాసించెను. విజ్ఞానము లేనిదే మోక్షము చేకూరదని హైందవ గ్రంథములలో వ్రాయఁబడియున్నది. జ్ఞానమనఁగా దుఃఖాభివృద్ధియేయని యొక పురాతన యూదు గ్రంథకర్త వ్రాసెను. జ్ఞానమనఁగా దుఃఖనివృత్తియని ఆర్యులయభిప్రాయము. ఈవిజ్ఞానమునే ఆత్మదర్శనమునకు హేతువుగా వ్రాయఁబడియున్నది. ఈవిషయమునసే ఆశియాఖండ విజ్ఞానరహస్య మిమిడియున్నది.

అనేకయుగములనుండి ఆశియాఖండము ఆత్మానుభవము నెఱిఁగియున్నది. ఈవిజ్ఞాన సమస్య బుద్ధివికాసక, రసజ్ఞానసూచక, నైతిక, మత, ఆధారముల మూలమునఁ జర్చింపఁబడినది. హిందూదేశ, పర్షియా, చీనా, జపాను, అరేబియా, ఆఫ్గనిస్థానదేశములలోని కవులు, ఆలోచనాపరులు, మొదలగువారు దీనిని విమర్శించిరి. ఈసమస్య వేర్వేఱు భాషలలో వేర్వేఱు విధములుగా వ్రాయబడియున్నది. కాని వానియన్నిటిలో ముఖ్యముగా నేకవస్తు ప్రతిపాదనమున్నదని నేను నమ్మెదను. ఏలననగా ఆశియాఖండ

మంతటికి ఆత్మాభిజ్ఞానమొక్కటియే. దీనినిఁగూర్చి "శాశ్వతపదార్థమొక్కటియే. దానికి జాతిలేదు." అని యుపనిషత్తులలోఁ దెలుపఁబడియున్నది. తరతరములనుండి ఆశియాదేశములో కళ, కవిత్వ, వేదాంతములలో, ఆశాశ్వత పరబ్రహ్మ స్వరూపమును గూర్చియే నిరూపింపఁబడుచున్నది. దానినిఁ గూర్చియే పూజఁగావింపఁ బడుచున్నది. ఆశియాలోనే అన్ని మతములు పుట్టుట యిట్టి ప్రాముఖ్యమువలననే సంభవించినది. హిందూమతము, బౌద్ధమతము, యూదుమతము, ఇస్లాముమతము మొదలగునవి యెచ్చటనున్నను, అవి ఆశియాఖండ ప్రబోధములే. ఆసియాఖండము క్రైస్తవమతమును పాశ్చాత్యులకిచ్చెను. మతసిద్ధాంతములయొక్కయుఁ, శాస్త్రసిద్ధాంతములయొక్కయుఁ, బరస్పర ప్రాతికూల్యమునుగూర్చి ఆశియాఖండమేమియుఁ జెప్పియుండలేదు. ఆశియాఖండ ఋషులు పాశ్చాత్యులవలె విజ్ఞానమునకును, ప్రకృతికిని, ప్రాతికూల్యముఁగలదని యోచింపలేదు. ప్రకృతి ప్రబోధము వలననే విజ్ఞానము కలుగుచున్నదని, హిందూదేశము నమ్ముచున్నది. ప్రపంచ సాహితినిఁ బెంపొందించిన మన పురాతన యుత్కృష్టగ్రంథములు, ఆశ్రమములనెడి అటవీ విశ్వవిద్యాలయములలోనే వ్రాయఁబడినవి. ఆశియా విజ్ఞానము యిరోపీయ విజ్ఞానము వంటిదికాదు. హైందవ పురాతన విజ్ఞానము సంకుచిత జాతీయతమీఁదఁ బెంపొందింపఁబడలేదు. ఆవిజ్ఞానమొక్క మానవ ప్రపంచము నెడలనే కాక, సర్వచేతన స్వరూపముల యెడలను గలిగిన గౌరవభావమువలననే కలిగినది. హైందవ బౌద్ధుల అత్యున్నతసిద్ధాంతము సర్వసమత్వభావమును బ్రతిపాదించుచున్నది. హైందవులకళ, సాహితి, వేదాంతము, శాస్త్రము, నాగరికత, మొదలగునవి యెన్నివిధములఁ బ్రాక్పశ్చిమ జాతులఁ బ్రేరేపించెనో చెప్పుటకు నవకాశము లేదు. హైందవవిజ్ఞాన సంబంధమైన విద్యాశాలనొకటి స్థాపించి యందుఁబండితులను జేరఁదీసి పరిశోధనలవలన హైందవ విజ్ఞానప్రాముఖ్యముల నిరూపింపఁజేయుట అవసరము. ఈసందర్భమున నేనొక్క సంగతి మాత్రము చెప్పెదను. ఈఖండము యొక్క విజ్ఞానమును బెంపొందించుటలో సింధుదేశమెంతయో సాయ-

పడినది. మనదేశములో మహమ్మదీయ ప్రభుత్వస్థాపనకుఁ బూర్వము సింధుదేశము బౌద్ధమతమునకుఁ బట్టుకొమ్మగా నుండెనని బహుశా మీకుఁ దెలియకపోవచ్చును. బాగ్దాదు మూలమున సింధుదేశమునకు ఆశియా యిరోపాఖండములతో సంబంధము కలసినది. ఆరోజులలో బాగ్దాదు ఖిలాఫతునకు ముఖ్యస్థానముగా నుండెడిది. బాగ్దాదు ఆస్థానమునకు సింధుదేశపుఁ బండితులగు వైద్యులు, వేదాంతులు, కవులు మొదలగువారు వెళ్ళియుండిరి. సంస్కృత సాహిత్యములోని కొన్ని మహాగ్రంథములను అరబిక్, పర్షియన్, భాషలలోనికి సింధుదేశపుఁ బండితులే భాషాంతరీకరించిరి. ఈభాషాంతరీకరణ గ్రంథములను అరేబియా విద్వాంసులు మధ్యయుగకాలమందు యిరోపాదేశములోని కొన్ని మహావిశ్వవిద్యాలయములకుఁ గొనిపోయిరి. సింధుదేశ యువకులకు యీవిషయముపట్లఁ బరిశోధనకు మంచి యవకాశముగలదు. జ్ఞానమునుండియే ఆత్మ గౌరవము కలుగుచున్నది. సింధుదేశీయులు పూర్వకాలమునఁ దమ పూర్వులు గావించిన ఘనకార్యములను కనుఁగొనినచో వారికి నూతనదేశభక్తియు, నుదారమైన యాత్మగౌరవమును, పొడమును. అప్పుడే వారు ఆర్యుల ఆదర్శప్రియత్వ మబ్బినవారై తమభాగ్యతలఁ గుర్తెఱింగిన వారగుదురు.

ఆశియాఖండ విజ్ఞానము సమ్మోహనకారకము. హిందూదేశము ఆత్మాభిజ్ఞానము గలిగి యితరదేశీయుల బాగుపఱుప మహాసందేశము నొసంగుటకై యొక జాతీయ విజ్ఞానపద్ధతిని బెంపొందించుటకు మన మాత్రపడుచుండు నీకాలమున ఆశియాఖండమెంతటి విజ్ఞానముఁ గలిగియుండెనో, తెలిసికొనుటకు మనకందఱకుఁ గుతూహలముఁగలదు. ఆశియాఖండ ఆదర్శప్రియత్వమును నేఁడు ప్రపంచమున కత్యావశ్యకముగనున్నది. పూర్వకాలమున ఆత్మసందర్శనమే ఆశియాఖండమహోన్నతికిఁ గారణముగనుండెను. నేఁడు యిరోపాదేశము నాగరికతాభివృద్ధికై యిట్టి ఆత్మసందర్శనమునే కోరుచున్నది. "పూర్వమొకప్పుడు ప్రాగ్దేశమునుండి జ్ఞానతేజమువచ్చినది. మఱియొకమారు ప్రాగ్దేశమునుండి యిరోపాదేశమునకు అజ్ఞానతేజము మఱలి

వచ్చు"నని ప్రొఫసర్ టిండాల్ అను శాస్త్రజ్ఞుఁడు చెప్పెను. ఆశియాఖండము పాశ్చాత్యులకు ఆధ్యాత్మిక సందేశ మొకటి తప్పక యిచ్చునని నేను నమ్ముచున్నాను. హైందవుల సందేశ మెప్పు డిత్తురా యని ప్రపంచ మెదురుచూచుచున్నది. అడఁకువఁగలిగి మానవ సేవఁ జేయవలయునను పద్ధతిమీఁదనే హైందవులాసందేశము నీయఁగలఁ. గర్వ, కోప, ద్వేషభూయిష్ఠమైన దేశభక్తి హిందూదేశము నెన్నటికిని యుచ్చస్థితియందుంచఁ జాలదు. "నీవు సౌమ్యదిఁగలిగి యుండినచో ధైర్యముఁ గలవాఁడవగుదువు. నిరాడంబరుఁడవైనచో నుదారుఁడవై యుందువు. నీవు వినయముఁగలిగియుండినచో మనుష్యులలో నాయకుఁడవుగా నుందువ"ని యొక చీనాదేశపు ఋషి చెప్పెను. జాతులన్నిటిలో హైందవజాతి ఆధ్యాత్మికనాయకత్వము వహింప నిశ్చయించినచో, అతివినయముఁగలదై మానవసేవను అనఁగా నీశ్వర సేవను సేయుచుండవలెను. యంత్రసమూహముచేతను, లౌకాయతమతముచేతను, విఱ్ఱవీఁగుచున్న ప్రస్తుతయుగము ఆశియాఖండ విజ్ఞాన భావముచేతను, ప్రాగ్దేశ వేదాంత, సాహిత్య, కళల నుద్భోదించినట్టి ఆధ్యాత్మికసందర్శనముచేతను, రక్షింపబడవచ్చును.

ఆశియాఖండ చైతన్య రహస్యము.

అహమ్మదు అబ్దుల్లా అను నాతఁడొక మహాగ్రంథకర్త. అతఁడు అఫ్గనిస్థానదేశీయుఁడు. అతఁడు వ్రాసినకథలన్నియు సులభరీతి ననుసరించి కథాపథకముఁ జెడఁగొట్టకుండ మహోద్దేశములు నిరూపించునట్లు వ్రాయఁబడెను. అతఁడు వ్రాసిన యనేకగ్రంథములలో ప్రాచ్యఖండ జ్ఞానమును స్పష్టీకరించి రూఢిపఱచుటయే గ్రంథోద్దేశముగా నుండెను. ప్రాచ్యఖండవాసుఁడు కాఁబట్టియే యతఁడు మనదేశీయుల హృదయములలోనికి సులభముగాఁ జొచ్చుచున్నాఁడు. ప్రాచ్యఖండ జీవితమును గూర్చి నిరాదరణభావమున విస్తరించి వ్రాసినట్టి "కిప్లింగు" గ్రంథములో నీయాఫ్గనిస్థాన గ్రంథకర్తకుఁగల మనశ్శక్తియుఁ, బ్రవర్తనశిక్షణమును, కానరాదు. అహమ్మదు అబ్దుల్లా వ్రాసిన కథలలో "బాటూమ్ — నాగరకత విషయమై యొక యభిప్రాయము" అనునొక కథకలదు. రష్యాలో "బాటూమ్" అనునది యొకపట్టణము. ఈకథలో అబ్దుల్లా ఆస్థలమును గూర్చియు, ఆజనులను గూర్చియుఁ, దనయభిప్రాయములను వ్యక్తీకరించెను. ఆపట్టణమం దతఁడు ఎందఱినో ఆశియాఖండవాసులను, ఎన్నియో ఆశియాఖండవస్తువులను, జూచి యాశియాఖండమింకను సజీవమై యున్నదని గ్రహించెను.

"అనాదినుండియుఁ బాశ్చాత్య ప్రపంచమునకుఁ బ్రాచ్యప్రపంచము సందేశమిచ్చుచుండె" నని యతఁడు వ్రాసెను. మంగోలుజాతులు అనేకశతాబ్దములకుఁ బూర్వము యూరపుఁబైఁబడి రష్యా, జర్మనీ, దేశములను జయించెననియు, అరబ్బులు స్పెయిన్, సిసిలి, ప్రాంతములను జయించి యూరోపు వీర్యమును భగ్నముఁగావించెననియు, తుర్కీదేశీయులు మధ్య విరోధాను చెదరించి రోము రాజ్యముయొక్క తూర్పుభాగమును జయించెననియు నతఁడు వ్రాసెను. "పశ్చిమఖండ మెప్పుడును

ప్రాచ్యఖండమునకు లొంగియే యుండె" నని కూడ నతఁడు వ్రాసెను. ఈ కాలమున ఆశియాఖండముకంటె యూరపుఖండము మిన్నగా నుండలేదా? ఇస్లాము మతము దురవస్థలో నుండలేదా? నేటికాలమున మెసపొటేమియా, సిరియా, చిన్న ఆశియా, అరేబియా, పర్షియా, మున్నగు భాగములు ఐరోపీయ అధికారులకు లొంగియుండలేదా? నేఁడు హిందూదేశము బలహీనమైయుండలేదా? నిజమే. బలహీనమైయున్నది. కనుకనే "బలహీనుల సుఖమును కనిపెట్టియుండుడు" అని యొకపురాతన హైందవగ్రంథము చెప్పిన వాక్యమును మీరు గమనించుడు. ఇదివఱకే ప్రాచ్యఖండ బలహీన జాతులు అనఁగా హిందూదేశములోని హైందవ, మహమ్మదీయులును, ఈజిప్టు, పర్షియా, ఆల్జీరియా, చిన్నఆశియా, దేశములవారందఱును స్వప్రయోజనము నాశించెడి పాశ్చాత్యదేశపు సామ్రాజ్య సిద్ధాంతములక్రింద నణఁగఁద్రొక్కఁబడుచుండిరి. మీరేమి చేయుదురో ఆకర్మము మిమ్ము వెంబడించియే వచ్చునను సిద్ధాంతముఁ గలదు. "రాజనీతియందుఁ బ్రతివిషయము జరిగి పోవుచుండినను ఆవిషయములు తిరిగి చరిత్రలలోనికి వచ్చుచుండును. నేటి బలహీనులస్థితి ప్రాచ్యఖండముయొక్క భవిష్యత్తును, లేక, ప్రపంచముయొక్క భవిష్యత్తును, సౌఖ్యములఁ దులఁదూగించునని నేను నమ్ముచున్నాను. ప్రాచ్యఖండము చచ్చిపోలేదు. కాని నిద్రావశమైయున్నది. మనుష్యునియొక్క ఆధ్యాత్మిక నాగరకతపై బ్రతిఘటించెడు ఐరోపీయ నాగరకతను నెదుర్కొనుటకు హిందూదేశ మాతురపడుచున్నది. పూర్వకాలమున ఆశియాఖండము యూరోపుఖండమునకెంతయో అభివృద్ధికారకముగా నుండెననియు, నాగరకత, విజ్ఞానము, ఔషధప్రతిభ, జ్యోతిశ్శాస్త్రము, నానావిషయములు మొదలగునవియన్నియు పశ్చిమఖండ మిచ్చట నుండియే గ్రహించెననియు, పురాతన మంగోలు జాతులు, మలయాజాతులను దక్షిణపసిఫిక్కు మహాసముద్రమును అమెరికాదేశమునకు బోఁగలిగినియు, పురాతన హైందవులు జావాద్వీపమునకు హైందవత్వము జేర్చి వానికి నాగరకత గలిగించినట్లును, మహమ్మదు పుట్టుటకు పూర్వము అర

బ్బులు చీనాదేశముతో వర్తకము జేసిరనియు అహమ్మదు అబ్దుల్లా వ్రాసెను. ఈ విషయములన్నియు, బ్రిటనుపైగాని జర్మనీపైగాని తాము దాడివెడలుట మహాసాహసకార్యమనియు, ఆకీర్తి ప్రపంచమున చిరస్థాయిగా నుండుటకు గ్రంథనిర్మాణ మవసరమనియు, రోమను లెంచుకొనుకాలమున జరిగినవి. "ఐరోపీయ విషయమేదియు ఆశియాఖండములో శాశ్వతముగ నిలువలేదు. 300 సంవత్సరములనుండి హిందూదేశముయొక్క స్పర్శగలిగిన ఇంగ్లండు దేశము రేపు హిందూదేశమును వదలిపెట్టినచో జను లింగ్లండను పేరుగూడ మఱచిపోవుదురు. ఇట్లే ఫిలిపైనుదీవులలోని అమెరికనులస్థితియు, ఇండోచీనాలోని ఫ్రెంచివారి స్థితియు తటస్థించును. ఇంతవరకు ఆశియాఖండములోని ఒకజాతియైనను సంపూర్ణముగ ఐరోపీయత కలిగియుండలేదు. ఆశియాఖండములో పుట్టవలసినదేగాని, ఐరోపీయ జ్ఞానవృక్షముయొక్క శాఖయొకటైనను యీఖండమున కింతవరకు జొచ్చియుండలేదు. ఐరోపాదేశ మొకరి ననుకరింప వలసినదేగాని తనకు కల్పనశక్తిలే" దని యాతఁడు వ్రాసెను. "అనుకరించె" నని చెప్పుటకు బదులుగా ఐరోపాదేశము ఆశియాజ్ఞానము పరిపూర్ణముగ గ్రహించి జీర్ణముచేసికొనెనని చెప్పిన బాగుండును. ఐరోపీయ నాగరకతయనగా నిట్లేర్పడినదే. ఐరోపీయ సాహిత్యజీవితములలో క్రైస్తవమతము, ప్రజాప్రభుత్వము అను రెండే మహావిషయములు గనబడుచున్నవి.

ఇక ప్రజాప్రభుత్వవిషయమై ఆలోచించినచో, "ప్రజాప్రభుత్వ ప్రతిష్ఠాపనలు ముఖ్యముగా ఆర్యుల ననుకరించినవి. అవి హిందూదేశము నుండి యూరపునకు ప్రాకినవి" అని మెయిన్ అను విమర్శకుఁడొకడు వ్రాసియుండెను.

మనసాంఘిక జీవితమునందలి పంచాయతీ పద్ధతిలో ప్రజాప్రభుత్వ సూత్రము నిశ్చయముగా నిమిడియున్నది. హిందూదేశమింకను సజీవమైయున్నది. ఈ దేశములో నవీనజాతీయోద్యమ ప్రచారముగూర్చి యోచింపుడు. ప్రాచ్యఖండ చైతన్యమాశ్చర్యదాయకము. ప్రాచ్యఖండమంతటను

పెరుగుచున్న అశాంతియే అసజీవత్వమును సూచించుచున్నది. ఈ అశాంతి నుండి ప్రాచ్యఖండమెట్లు క్రొత్తవిధానమును వెలిదీయునా? ఈ ఖండము నేటి కష్టములనుండి తన్నుదా నుద్ధరించుకొనునా? మఱియు యూరపు యొక్క నూతనప్రతిఘటనమును సహారింప గలదా? అట్లు సహారింప నిశ్చయించినచో ద్వేషకలహముల నిరసించి నూత్న విజ్ఞాననాగరకతల నెంపొందింపవలెను. ఆ పెంపొందించు విజ్ఞానము మతసాంప్రదాయాచరణముల నుండియు, నీతికోవిదత్వమునుండియు, కళాసాహిత్యములనుండియు కలుగునదిగా నుండవలెను. మఱియును మీరు పెంపొందించు నాగరకత రాజనీతి శాస్త్రమునుండియు, పరిశ్రమలనుండియు, వ్యవసాయపద్ధతుల నుండియు సాంఘిక జీవన ప్రతిష్ఠాపనములనుండియు కలుగునదిగా నుండవలెను. ఈవిజ్ఞానము నాగరకత అను రెండు విషయముల సమ్మేళన మెన్నడు కలిగెనో ఆ కాలముననే హిందూదేశము మహోన్నతస్థితియందుండెను. అనంతర మీదేశపు పండితశ్రేష్ఠులు మతసంప్రదాయముల గుత్తెతింగి తాము సన్యాసమును స్వీకరించి ప్రపంచవిషయ జీవితమునకు వెలియై దేశమునందలి నాగరకతోద్యమమునకు విముఖులై యుండిరి. సౌందర్య స్వరూపమైన ఆత్మయొక్క సందర్శనమును ఆత్మానుభవమును లేనిచో కలిగిన విజ్ఞానమంతయు నిరర్థకము. జాతీయ స్వాతంత్ర్యమును సంపాదించుటకై కలహములేకుండ నాగరకత కలుగనేరదు. అట్టిస్వాతంత్ర్య నిర్వహణమునకై ఆశ్రమములు, జాతీయప్రతిష్ఠాపనలు, దేశభాషాభివృద్ధి, కళలయొక్కయు సాహితియొక్కయు పునరుద్ధరణము కావలసియున్నవి. ఇందుకొఱకై విద్యార్థులకు, యువకులకు ప్రజాసామాన్యమునకు, స్త్రీలకు విద్యనొసంగి దేశమునందుగల ప్రస్తుతపద్ధతిని నిరసించునట్లు చేయవలెను. దురంతములను అన్యాయములను జూచి మనము సమ్మతి జూపనిచో స్వాతంత్ర్య సంపాదనేచ్ఛ మనకు బాడమ నేరదు. ఏది ఆశియాఖండ చైతన్యరహస్యమో ఏది ప్రపంచమున వేయఁగల మహాసందేశమో అట్టి ఆధ్యాత్మికాదర్శభావముతోడనే మనకు సమ్మతులఁ జూపవలెగాని కలహోత్సవ భావములతోఁ జూపఁదగదు.

హైందవ కళలోని ఆంతర్యము.

ఈకాలమున మన ప్రతిపక్షులు మనధైర్యము, రాజకీయ దూరదృష్టి, సామర్థ్యము, విద్యాజ్ఞానము, నాగరకత మొదలగునవి లేవని యాక్షేపించుచున్నారు. కాఁబట్టి కొంతవఱకైనను మనహిందూదేశ మిన్నియుగములనుండియు దేనిని వాంఛించి యుండెనో దెలిసికొనుటకు మన పూర్వులగు ఆర్యుల నాఁటి నాగరకత యెట్లుండెనో మనయువకులు గ్రహింపవలసియున్నది. ఎవనికిఁ దనదేశచరిత్రము తెలియదో వాఁడు విద్యావంతుఁ డనిపించుకొనఁదగఁడు. ప్రస్తుతకాలమున హిందూదేశము నుద్ధరింపఁదలపెట్టు ప్రతియువకుఁడును, పాశ్చాత్యజీవితములోని మహోదారవిషయములను, పురాతన హైందవాభివృద్ధియుఁ, బరిపూర్ణముగ గ్రహింపవలసియున్నది. ప్రస్తుతపద్ధతినుండి హిందూదేశమును మంచిస్థితిలోనికిఁ దెప్పించుటకుఁ బూర్వహైందవ విజ్ఞానమును, ప్రస్తుతహైందవ జీవితముయొక్క సాధ్యాసాధ్యములును, ప్రతి యువకుఁడును చక్కగా గ్రహింపవలసియున్నది.

కళయనఁగా జాతీయ విజ్ఞానములోని యొకభాగమే. పురాతన హైందవశిల్ప ప్రాశస్త్యమును నేఁడు మనజీవనమున కదియెట్లు సాయపడునో తెలియఁజేయుటకు నాకుఁ గుతూహలముగా నున్నది.

పూర్వకాలమున హైందవుల శిల్ప నైపుణ్యము ప్రశంసాపాత్రముగా నుండెను గాన నిర్లక్ష్యభావముతో జూచుటకు వీలులేదు. ఆశిల్ప వికాసము పరదేశముల వ్యాపించెను. మహాభారతములో అనేకకట్టడములు అసుర మయునివలన నేర్పడినవని తెలుపబడియున్నది. ఈ అసురమయుఁడు పరిషియాదేశీయుడు. పర్షియాలోని శిల్పమునకును హిందూదేశములోని శిల్పమునను చాలసామ్యముగలదు. పర్షియాదేశములో రాతిలో తొలిచిన సమా

ధులయొక్క శిల్పచాతుర్యము మనహిందూదేశములో ననేక ప్రదేశముల గానవచ్చుచున్నది. సరనాథ్‌లోని శిల్పచాతుర్యమును, పాటలీపుత్రములోని రాచనగళ్ల శిల్పనైపుణ్యమును, పర్షియాదేశ శిల్పముతో సరిపోలియున్నవి. హైందవుల జ్ఞానాభివృద్ధి యీదేశమునందే కాక యితరదేశములకుగూడ వ్యాపించియుండెను. రోము, యీజిప్టు, బాబిలోను దేశములతో హిందూదేశము వ్యాపారము జేసెను. సయాము, కంబోడియా, జావా మొదలగు ప్రదేశములకు హైందవులు వలసబోయి అచ్చట చిన్నచిన్న రాజ్యస్థానములుగూడ గావించుకొనిరి. హైందవవిజ్ఞానమునకును ఇతరదేశ విజ్ఞానములకును పరస్పర సాహచర్య మాకాలములోనుండెను. ఈ ఇతరదేశములలో పరిషియా గ్రీసు మొదలగునవి కలవు. బుద్ధవిగ్రహములకు గ్రీకు ప్రాథమికత్వము కలదని కొందరు వాదించెదరుగాని నేను నమ్మను. కాని కొన్ని బుద్ధవిగ్రహములకును గ్రీకుల దైవవిగ్రహములకును సామ్యముగలదు. హైందవ శిల్పసౌష్ఠవమునకు బౌద్ధమతము కొంతసాయపడెను.

బౌద్ధమతమునందు "నిర్వాణ" మునకు కోరికలన్నియు నిర్మూలము చేసికొనుట యని యర్థము చెప్పబడినది. బౌద్ధమతాభిప్రాయములందు "సన్యాస" మెక్కుడు గౌరవముగా జూడబడుచుండెను. ఈ యర్థమునే హైందవ శిల్పములోని అంతర్యము వ్యక్తీకరించుచున్నది. గూంటూరుజిల్లాలో ప్రసిద్ధివడసిన అమరావతి గ్రామములోని శిల్పములు "అధికారి" హృదయములోని ప్రాపంచిక దుఃఖమునే నిరూపించుచున్నది. ఈశిల్పములన్నియు వినోదము కొఱకే యని భావించి సన్యాసత్వమే శ్రేష్ఠమని మహానీయులనేకులు పూర్వమొకప్పుడు గ్రహించినమాటనిజమే. కాని ఆయభిప్రాయము చాలా కాలము నిలువకుండెను. ఎల్లెడలను మనుష్యుఁడు మోక్షమునకై యెదురుచూచుచు సుందరపదార్థ పూజనమున కాతురపడుచున్నాడు. కావుననే ఆకాలమున మతాభివృద్ధికి శిల్పము ముఖ్యాంగముగనుండెను. హైందవాభిరుచినిబట్టి ఆకాలమున కర్మకాండననుసరించియు రామకృష్ణాద్యవతార చేష్టలననుసరించియు మతసమ్మిళితమైన శిల్పశాస్త్రమభివృద్ధి గావింపబడెను.

విజ్ఞానులైన బ్రాహ్మణునికి యీశ్వరునియొక్క "నామ, రూప" భేదములతో నవసరములేక పోయినను నిర్గుణోపాసనము గాక సగుణోపాసనము గావించుటకు గావలసిన భక్తిమార్గమునకును మానవ జీవితమునకును ఆభేదములు కావలసి యున్నవి. కావుననే రామకృష్ణాద్యవతారములు గావించిన ప్రత్యేకచేష్టా వికారముల నిరూపించుటవలన హైందవ శిల్పచాతుర్య మభివృద్ధి గావింపబడినది. ఈకాలమందు హిందూదేశనగరవీధులలో అతికుతూహలమును, కళాప్రాశస్త్యమును, రూఢిపఱచునట్టి పటములెన్నియో కనుబడుచున్నను, విద్యావంతులగు హైందవులే వానిని నిర్లక్ష్యముతోఁ జూచుచున్నారు. రాముఁడు అయోధ్యకు మఱలివచ్చుట, రామునియందు లక్ష్మణునికిఁ గలభక్తి, రామునియందు సీతకుఁ గలప్రేమ, పిత్రాజ్ఞననుసరించి రాముఁడరణ్యవాసముఁ జేయఁబోవునప్పుడు ప్రజలుఁ జూపినరాజభక్తి, పుష్పమయ వృక్షంబుక్రింద శ్రీకృష్ణుని వేణుగానము, కృష్ణునికొఱకు రాధ వెదకుట, శ్రీకృష్ణునియందు గోపికల గాఢానురాగము, ఆవులమందపై శ్రీకృష్ణునికిఁ గలప్రేమ, కౌరవయుద్ధమందు శ్రీకృష్ణుఁడు అర్జునునకు సారధిగానుండుట, శ్రీకృష్ణుఁడు అర్జునునకుఁజూపిన విశ్వరూపము, ఈమొదలగునవి యన్నియు పటములపైఁ జిత్రింపబడినవి. అవి బజారులలో చవుకగా దొరకుచున్నవి. వానియందు శిల్పాభిరుచిఁ గలిగిన ప్రతివిద్యార్థికిని మహానందము గలుగుచున్నవి. హైందవశిల్పముల అంతర్యమంతయు జీవితముయొక్క సన్యాసపద్ధతి యందుగాక కర్మకాండపై యాధారపడియున్నది. హైందవ చిత్రకారుఁడు ఈశరీరమునుగూర్చి యెన్నఁడును భయపడలేదు. అది అస్థిరమనితలఁచెను. దృగ్గోచరమగు ప్రతిపదార్థము మార్పుఁజెందుచుండును. అట్లే శరీరియు కాలచక్రప్రభావమున మార్పుఁ జెందుచుండును. హైందవసిద్ధాంతముప్రకారము ప్రకృతి, ఆత్మ, భూతదయ, అను మూఁడింటినుండి రసజ్ఞానానుభవము కలుగుచున్నది. ప్రకృతిమార్గములన్నియు సౌందర్యవికసనములే, మనుష్యుఁడు వస్తువులపైఁ ప్రేమానందమును వహించుచుండును. ఆత్మ ఎల్లప్పుడును ఆనందమునకై ఆతురపడుచుండును. ఈ ఆనందము దాక్షిణ్యబుద్ధిఁ

కలిగినవాని కెవనికిని గలుగదు. కాని యెవఁడంతరాత్మయొక్క శోభను దృగ్గోచరము గావించుకొనునో అట్టివానికే ఆయానందము కలుగును. అయంతరాత్మయొక్క అనఁగా నేమి? అది గీతలు, రంగులు, మొదలగునవి తెలుపునది కాదు. శోభ యనఁగా అశాశ్వత పదార్థమైన పరమాత్మయొక్క వికాసమే యని హైందవ చిత్రకారుని యభిప్రాయము. ఈ యాత్మ శోభానుభవము ప్రాపంచిత దుర్విషయములనుండి మనుష్యుని మఱల్చును. ఆత్మానుభవము జీవితమునందు మనుష్యునికట్టి దాస్య, దుఃఖ అన్యాయములు కలిగినను, అవి సరకుఁజేయింపక పరమాత్మయొక్క స్వచ్ఛందశోభను మాత్రమే గ్రహింపఁజేయును.

ఆత్మ శోభానుభవము నెవ్వరికిఁగలదో వాఁడేముక్తుఁడు. ఆత్మానుభవముగల సాధుపుయొక్క కలికిమొగము వికాశవంతముగనే యుండును. స్వతంత్ర పురుషుని మొగ మట్లే యుండును. అనావశ్య కల్పనలఁ గావించినచో శిల్పనైపుణ్యముఁ జెడిపోవును. కాపుపిల్లను నిరాడంబరమైనదుస్తులు గలదిగాను, తన ముఖవికాసమును తానుగుర్తెఱుంగునట్టిదిగాను చిత్రించిన యెడల సానందదాయకముగ నుండును. బహిశ్శోభకొఱకొక నీటుగాఁడెన్నియో వేషములు ధరించినట్లును, అస్వాభావికమైన పాపటను దిద్దునట్లును చిత్రించినచో నది మొదటిదానియంత వికాసవంతముగనుండదు. కొన్నివారములక్రిందట పురాతనప్రఖ్యాతిఁ గలిగిన "అలోరా" పురములోని పాడుపడిన కట్టడముల నేఁజూడఁబోయితిని. సింధు దేశీయులే దానినిప్పుడు మఱచియున్నారు. అక్కడనేనొక బావిని జూచితిని. దానికొక పర్షియాదేశపు గిలక కలదు. బాలులెందరో అత్యుత్సాహముతో గిలకను ద్రిప్పుచు నీరులాగుచుండిరి. వారు దానినసేకమారులు ద్రిప్పిరిగాని అలసటఁ జెందలేదు. ఆపనియందు మహానందమును జెందుచుండిరి. ఆపనివారికొక ఆటగానుండెను. అట్టి మహానందమును జెందువారే ముక్తులు. మనయీకాలపు గృహములు మిగుల నసహ్యముగానున్నవి. అవి కొలఁదిమంది ధనాఢ్యుల సౌఖ్యమునకై నిర్మింపబడినవి. "హైద్రాబాదు"లోని యెఱ్ఱరాయి గృహములును, "కరాచీ" పట్ట

ణములోని మహాసౌధములును, మనుష్యాత్మకు స్వేచ్ఛను పెంపొందించునట్లు లేవు. ఆకట్టడములన్నియు "విద్యావంతులు" తమయవివేక మానవసోదరుల రాబడినుండి విస్తారమైన ధనము గడించి, దేశమునందు కూలీలపోటి యెక్కువగా నుండుటవలన ఆకూలీలకు సాధ్యమైనంతవఱకుఁ గూలితగ్గించి, వారికి మనఃఖేదము కలిగించినట్లు తెలుపుచున్నవి.

మీయెఱ్ఱరాతికట్టడములన్నియుఁ బరులకు హానికలిగించి వారినుండి గ్రహించిన సొమ్మువలననే కట్టఁబడినవి. మీసౌధములన్నియు దాస్యబంధితులచేతనే కట్టఁబడినవి. పూర్వకాలపుకట్టడములు సంతుష్టులైన శిల్పులచేత కట్టఁబడినవి. ఇన్నిశతాబ్దములైనను ఆకట్టడములు వికాసవంతములుగ నున్నవి. స్వాతంత్ర్య సౌఖ్యముల ననుభవించు పూర్వకాలపు శిల్పి తాను రచించు కట్టడములపైఁ దనశిల్ప నైపుణ్యమంతయుఁ గనఁబఱచి యాత్మానందమును జెందుచుండును. ప్రేమాస్పదుఁడైన ఆపరమేశ్వరుఁడు మనుష్యునికి వివిధకళల నేర్పునట్లుఁజేసి ఆమహానందమును చవిఁజూపించుచున్నాఁడు.

సౌందర్యస్వరూపుఁడై పరమాత్మ శాంతిస్వరూపుఁడుగఁగూడ నున్నాఁడు. ఒక్కొక్కని మొగమునందు సౌందర్యమునకు శాంతిగూడ వన్నెపెట్టుచుండును. పరహృదయములకు శాంతిఁ జేకూర్చును. సెంటు ప్రాన్సిసు జేవియరు అనునతని యతిసౌందర్యవంతమైన మొగమును జూచినప్పుడు మనఃక్లేశములను బొందినవారెల్లరును తమదుఃఖమును మఱచి శాంతిసముద్రమున మునుంగుచుండెడివారఁట. హిందూసిద్ధాంతముల ప్రకారము చిత్రకారుఁడు, లేక శిల్పి, తన పనితనమును జూపుసమయమునందు భయసంశయాది వికారములన్నియు విడచి మహానందమున నోలలాడుచుండవలెనని వ్రాయఁబడియున్నవి. అతఁడు ఇంద్రియములను బహిర్విషయములపైకిఁబోనీయక మానసేంద్రియమును చిక్కఁబట్టి అతిశాంతి హృదయముతో విశ్వరూపుఁడైన పరమాత్మయొక్క సౌందర్యస్వరూపమును తనపనియందుఁ జూపింపవలసియుండెను. అతఁడు పనిప్రారంభించుటకు ముందు ఏకాగ్రచిత్తము నలవఱచుకొనవలసియుండెను. అతఁడాత్మకును, ప్రపంచమునకును

సంబంధము కనుఁగొనవలసియుండెను. అతఁడు దినదినము ప్రకృతినాటకమునందు జరుగు మార్పులన్నింటిని పరిశీలింపవలసి యుండెను. ప్రస్తుతకాలపు సిద్ధాంతములకును, పూర్వకాలపు సిద్ధాంతములకును, నెంతయో భేదమున్నది. పురాతనకాలపు హైందవ శిల్పము ఆదర్శప్రాయమై అంతర్గ్రాహ్యముగ నుండెను. పనితనములోని సౌందర్యమంతయు నట్టి భ్రమయే యనునర్థమునుబట్టి యిది యంతర్గ్రాహ్యమని చెప్పఁబడియుండలేదు. సౌందర్యమెన్నటికిని నట్టి భ్రమగానుండదు. చిత్రకారుని పనిలోని సౌందర్యమంతయు బరమాత్మయొక్క తత్త్వమును నిరూపించునదియేయగును. ఈసౌందర్యము కర్మేంద్రియములచే గ్రహింపఁబడునది కాకపోవుటచే నంతర్గ్రాహ్యమని చెప్పఁబడినది. ఈ సౌందర్యము ఆధ్యాత్మిక నేత్రముచేతనే చూడవలసి యున్నది. కావున హైందవశిల్పము మతబద్ధమైయున్నది. ఫెర్గూజన్ అను నొకమహానీయుఁడు హైందవశిల్పమునుగూర్చి యిట్లే వ్రాసియున్నాడు. హిందూదేశములోని కొన్ని దేవాలయములనుజూచినచో అట్టి సౌందర్యమును మనము గ్రహింపగలము. మనదేశచరిత్ర ముఖ్యముగా పూర్వశిల్పచాతుర్యమునకు సంబంధించియున్నది గాన హిందూదేశ చరిత్రకారునికిఁ బూర్వశిల్పమునుగూర్చి తెలిసికొను ప్రతివిద్యార్థియు మునుముందు సాయపడవలసి యున్నది. భూతదయాసూచకమైనట్టియు, జిజ్ఞాసను బురిగొల్పునట్టియు, జీవితముయొక్క కర్మయోగప్రాముఖ్యమును సూచించునట్టియు, శిల్పము చాలపూర్వకాలమునఁ బ్రచారమునందుండెను. నేఁటికాలపు శిల్పము, లేక చిత్రలేఖనము, మన ప్రజాహితజీవితమున కంతగా నుపయోగకారికాదు. ఈ "ఫోనోగ్రాపు" అను పనిముట్టువచ్చి మన సంగీతప్రచారమును కృశింపజేయుచున్నది. సుశ్లోకచరిత్రులగు ప్రహ్లాద, రామకృష్ణాదుల జీవితములను చక్కఁగాఁ బ్రపంచమునకు వ్యక్తీకరించునట్టి మననాటక రంగస్థలములయొక్క ప్రతిభను "సినిమటోగ్రాపులు" నాశనము చేయుచున్నవి. మనకిప్పుడు రాజకీయోద్ధరణముకొఱకును సాంఘిక, మతోద్ధరణముల కొఱకును, తగినచిత్రకారులు, శిల్పులు కావలసియున్నారు. వారు జీవితముయొక్క సారస్యము గ్రహింపఁ

గలిగి తృప్తికరముగ దేశమును సమాధానపఱచువారుగ నుండవలెను. నేఁటికాలమున అట్టిచిత్రకారుని చేతనే, లేక, శిల్పిచేతనే ప్రజాప్రభుత్వ సాధన బీజములు నెలకొల్పఁబడవలసియున్నవి.

పురాతనకాలమున శిల్పులు సన్యాసులుగానుండలేదు. వారు జీవితాదర్శమును గుర్తెఱింగినవారుగనుండిరి. ఆకాలపుఁబ్రజాహిత జీవనమునందు విశేష భోగములకును, సౌఖ్యములకును ప్రాముఖ్యమంతగా నీయఁబడియుండలేదు. ఆకాలపు రాజులుగూడ నిరాడంబరులైయుండిరి. నేటికాలమునవలె ఆకాలపుహిందూదేశము వర్తక ప్రభుత్వాధీనమై యుండలేదు. దేశములో చేయఁబడిన స్వదేశవస్తువులు పనివాఁడు తన పనితనమునందుఁ జూపిన మహానందమును స్పష్టీకరించునవిగానుండెను. ఆవస్తువులు సుందరములై భరతవర్షకీర్తిని అన్నిదిక్కుల వ్యాపింపఁజేసెను. ఆకాలమునందుఁ జిన్నరాజ్యములోఁ జేయఁబడిన చేతిరుమాళ్లయొక్క సౌందర్యమును గుఱించి యొక నీగ్రోజాతివాఁడు పాడిన పురాతన ఆఫ్రికాగీతమునందు వర్ణింపఁబడి యున్నది.

గ్రామవాసులు పరులకిచ్చు ఆతిథ్యము, సేద్యగానికిఁ దనభూమియందుఁ గలగౌరవము, చేమగ్గపుఁ జేతిపని, విశాలదృష్టితోఁ గట్టఁబడిన దేవాలయములు, నిరాడంబర జీవితము, మనశ్శాంతియందుఁ గోరిక, దైవభక్తి, అహింస, సర్వవస్తువ్యాపకమైన పరమాత్మ తత్త్వము,— ఇవి యన్నియు మనపూర్వుల నాగరకతను నిరూపించి యుండెను.

అట్టి విజ్ఞానము నేఁటికాలమున మనకు ముఖ్యావశ్యకముగానున్నది. పురాతన హైందవ శిల్పియొక్క ఆదర్శనమును మనము జ్ఞప్తియందుంచుకొనవలెను. మనమందఱము నిరాడంబరముగాను, పరిశుద్ధ మనస్సులతోడను, స్వార్థపరిత్యాగమునందు దృఢబుద్ధితోడను ఉండవలెను. పురాతన హైందవశిల్పి తనపనియందు నెట్టి యాధ్యాత్మిక సౌందర్యస్వరూపమును లిఖించి యానందించెనో, ఆసౌందర్య స్వరూపియైన పరమాత్మయే, దేశోద్ధరణమునకై మనము స్వార్థత్యాగులమైనచో, మనకెన్నియో యాశీర్వాదములనొసంగును,

హైందవ నాటకము.

ప్రాచ్యఖండము మహోన్నత స్థితియందుండినప్పుడు అనేకశతాబ్దములక్రిందట హిందూదేశములో సాహిత్యపరిషత్సభ లనేకములు జరుగుచుండెడివి. ఆసభలను రాజులును, సాహిత్యధురంధరులగు మహనీయులును, పోషకులుగనుండి నిర్వహించుచుండిరి. ఈ సభలలో సుకవుల కావ్యములనుగూర్చి విమర్శనచర్చలు గావింపబడుచుండెడివి. ఆకాలముయొక్క యౌన్నత్యమునకుఁ దగినటువంటి మహాసభలు నేఁడెచ్చటను గానరావు. దేశమిట్టి క్షీణదశకు వచ్చుట మిగులశోచనీయము. కాని యిప్పుడిప్పుడు యువకులు బయలుదేరి దేశమునం దాయాభాగముల విమర్శనకార్యముల నెఱవేర్చుచుఁ బురాతన గ్రంథములయొక్కయు, ఆచారములయొక్కయు, విలువను నిరూపించుచుండుట శుభసూచకము. ప్రాచ్యఖండ వేదాంతశాస్త్రమును వినోదముకొఱకేర్పడినదియనిగాని, యూహాజనితమనిగాని చెప్పుటకు వీలులేదు. కొంతకాలముక్రిందట యూరపులోఁ గనిపెట్టఁబడిన మహావిషయములు పురాతనకాలమున హిందూదేశవాసులెఱింగియే యున్నారని డాక్టరు రే గారి పరిశోధనములు తెలుపుచున్నవి. డాక్టరు బి. యస్. సీల్ గారి "హైందవుల పదార్థ విజ్ఞానశాస్త్రము" అను గ్రంథము ఈవిషయమై తగినంత పరిశోధనకు మంచి యవకాశ మిచ్చుచున్నది.

కాలము గడచినకొలఁది పురాతన హైందవ విజ్ఞానమును గూర్చి కొంచెము కొంచెముగాఁ దెలిసికొనుచున్నాము. ఆకాలపు హైందవులు మనకంటెఁ బరిశుద్ధులును, నిరాడంబరులును, నైయుండుటచేత వారు జీవితాదర్శముల నెక్కుడుగా గ్రహించి యాచరించిరి. వారు వస్తుతత్త్వమునుగూర్చి గాఢ విచారణను గావించిరి. గసజ్ఞానవిద్యయందు వారు మంచి నేర్పరులు. వారికి నాటకజ్ఞానమునందు మంచి పరిచయముగలదు.

హైందవనాటక సాహిత్యముయొక్క ప్రాముఖ్యము ఇతర జాతులవారికిని తెలియ నవసరమని నేను నమ్ముచున్నాను.

హిందూనాటకమునుగూర్చి చెప్పుట యనఁగా హిందూబౌద్ధ నాటకమునుగూర్చి చెప్పుటయే. మహమ్మదీయులు హిందూదేశమున కెంతయో మేలుఁగావించిరి. వారి శిల్పము, వారి పద్యకావ్యములు, దేశాభివృద్ధికై వారు సమర్పించినశక్తి, యుత్సాహములు, ఏకేశ్వరత్వమునుగూర్చి వారి గాఢవిశ్వాసము, ఈమొదలగునవి యన్నియు హైందవాలోచనా జీవితములతోడి సంబంధము కలిగియున్నవి. కాని మహమ్మదీయులు, దేశమునకుఁ దమ "నాటకమును" గూర్చి పరిచయముఁ గావించినవారుకారు. పర్షియనులకు అరబ్బులకు, మొగలులకు, ఆకాలమునందు జాతీయనాటక సంఘమొకటి కూడలేదని చెప్పుట సత్యమునకు దూరము కాదు.

హిందూదేశము గ్రీసుదేశముయొక్క నాటకప్రాశస్త్యముఁ జూచి తాను నేర్చుకొనెనని కొంతకాలము క్రిందట విశ్వసింపఁబడినది. సంస్కృతములోఁ దెరకు "యవనిక" అను నర్థము గలదు. ఈ "యవనిక" "గ్రీసుదేశపుఁదెర"కు నన్వయించుచున్నదఁట. అందుచేత అనఁగా యీ "యవనిక" యను పదము మనసంస్కృతములోఁ జేరియుండుటవలన గ్రీకుల నాటకముల ననుసరించియే మననాటకములును వ్రాయఁబడినవని కొందఱెంచుచున్నారు. కాని, "యవనిక" యనఁగా యవనులచేతఁ దయారు చేయఁబడిన వస్త్రవిశేషమనికూడ నర్థముఁ జెప్పవచ్చునని వారు మఱచిపోయిరి. యవనులు లేక గ్రీకుస్త్రీలు పూర్వకాలమున హిందూరాజుల ఆస్థానములఁ గనిపెట్టికొనియుండెడివారని మన గ్రంథములు కొన్ని చెప్పుచున్నవి. కాని యిది యంతయు హిందూదేశమునకును, గ్రీకుదేశమునకును, పరస్పర సంబంధమును తెలుపునే కాని వేఱుకాదు. రెంటికి సంబంధమున్నను ఒకదేశము మఱియొకదేశమును జూచి యనుకరించినదేదియు లేదు. అపరిమితజ్ఞానము నూత్నవిషయములఁ గల్పించును గాని యితరుల ననుకరించుట కిష్టపడదు. గ్రీకుదేశమునుండి హిందూదేశ మేదియుఁ దీసుకొనిరాలేదు. హిందూదేశమునుండి గ్రీసు

దేశమేదియు గ్రహింపలేదు. రెండుజాతులును వాని వాని జ్ఞానమును బట్టి సాహిత్యము పెంపొందించుకొనెను. మనము చదివిన కొలఁది, పరిశోధించిన కొలఁది, హిందూనాటకములకును, గ్రీకులనాటకములకును, అనేకభేదములఁ గనిపెట్టఁగలము. గ్రీకుల నాటకలక్షణములు, హైందవుల నాటకలక్షణముల వంటివికావు. నాటకములు విషాదాంతములుగాఁ జేయుపద్ధతి హిందువులలో లేదు. హైందవనాటకములలోఁ గల్పనా ప్రాధమికత్వము ముఖ్యమైనదని యెందఱో గ్రహించియుండిరి. రోము రాజ్యకాలమందును, యెలిజబెత్తు రాణి కాలమందును వ్రాయఁబడిన నాటకములలో "పరిహాసక" పాత్ర యొకటి చేర్పఁబడియున్నది. ఇట్టిపాత్రయే "విదూషకుఁడ" ను పేరుతో అది వఱకే హిందూనాటకములలోఁ జేర్పఁబడి యున్నది. మధ్యయుగమునాఁటి యూరపుదేశమందు వ్రాయఁబడిన నాటకములలో హాస్యగాని పాత్రయొకటి చేర్పఁబడియున్నదనియు, నంతకుఁ బూర్వమెంతకాలము క్రిందటనో ఆపాత్రయే హిందూనాటకములలో "విదూషకుఁడ"ను పేరుతోఁ జేర్పఁబడి యున్నదనియు, "పైకల్" అనునొక మహనీయుఁడు కూడ వ్రాసియున్నాఁడు. నేఁటి హిందూదేశమెంతవఱకుఁ గలదో అంతకు మించిన భూభాగములయందు ఆకాలపు హైందవ నాటకము తన ప్రతిభను వెల్లడించియుండెను. మధ్య ఆశియాలో గొంతకాలము క్రిందటఁ బురాతనతాళపత్రగ్రంథములు కనుఁగొనఁబడినవి. మధ్య ఆసియా, హైందవ సామ్రాజ్యమం దొకభాగముగానుండిన బహు పురాతనకాలముననే హైందవ నాటకజ్ఞానము పరిపూర్తియైనదని వానిలోఁ దెలుపఁబడినది. ఆఱవ శతాబ్దములోనే హిందువులు జావాద్వీపమునకు వలసఁ బోయిరి. హైందవ నాటక ప్రతిభ అక్కడకూడ వికసించినదని "జావా" ద్వీపములోని వీధి నాటక ప్రవృత్తి తెలుపుచున్నది. ఇదివఱకు బర్మా, సయాం, కంబోడియా, దేశములలో శ్రీరామ, బుద్ధనాటకములు రంగస్థలమందుఁ బ్రదర్శింపఁబడినవి. ఈ రామనాటకములు "మలే" ద్వీప సముదాయమునందును, చీనాదేశమునందును, ప్రజలకుఁ బరిచయములు గావింపఁబడినవి. హైందవులు

తమనాటకములయెడ మహాప్రాముఖ్యమును జూపుచున్నారు. యూరపుదేశములలో నాటకసంఘములకును, మతసంఘములకును పరస్పరవిరోధము పలుమారు కలుగుచుండెడిది. నాటక చైతన్యమంతయు పిశాచలక్షణమనియు, నవ్వు, సొగసు, మొదలగునవి యీశ్వరుఁడు గాక పిశాచమే యిచ్చుననియు, "క్రైసాస్టం" అను నతఁడు వ్రాసెను. రోములో, నాటకములలో వేషము వేయువారు అసహించుకొనఁబడుచుండిరి. పూర్వకాలమందు చీనాదేశములోఁగూడ నటులయొక్క సంతతివారు ఐదు తరముల వఱకుఁ బ్రభుత్వవిద్యాపరీక్షలలో నిలువఁబడుటకు నిషేధింపఁబడిరి. నృత్యశాస్త్రమును హైందవులు ఐదవవేదముగాఁ బరిగణించుచున్నారు. ప్రపంచానందమునకై యోచించి మనోధ్యానముఁజేసి బ్రహ్మ నృత్యశాస్త్రమొకటి దేవతలయొక్క రంగస్థల నిర్వాహకుఁడైన "భరతుఁడ"ను మునీశ్వరున కిచ్చెనని యొకగ్రంథమునందు వ్రాయఁబడియున్నది.

కాళిదాసు మొదలగు హైందవనాటకకర్తల నాటకములు కేవల కల్పితమునకేగాని స్వాభావికములుగావని కొందరు చెప్పుచున్నారు. లోకము భిన్నరుచులు గలది. "మన కావ్యములఁజూచి మనల నిందించువారెంత విశేషజ్ఞులు? బహుశా నావంటి అభిరుచిగలవారు కొందరున్నారనుకొనెదను. లేదా ముందు పుట్టవచ్చును. ఏలననగా కాల మతివిస్తీర్ణము గలది. ప్రపంచ మతివిస్తీర్ణముగలది" అని భవభూతి చెప్పినమాటలు జ్ఞప్తికి వచ్చుచున్నవి. ఈ వాక్యములు వ్రాయబడిన కొన్నిశతాబ్దములకు గోత్ అను నొకమహాకవిపుట్టి "ఓ శాకుంతలనాటకమా! నీయందలి పడుచుదనపు విలాసములు, వయసు జాఱినవెనుక గలిగెడు ఫలితములు, శ్రోతలమనస్సుల నానందాంబుధి నోలలాడించుచున్నవి. నీయందు ఇహపరలోకములయొక్క సౌఖ్యసమ్మేళనము చక్కగా నిరూపింపబడియున్నది. ఓ నాటకమా! నీవు ధన్యవు" అని కాళిదాసుని శాకుంతలనాటకమును బొగడియున్నాఁడు. హైందవనాటకముల (నాటకములలో దెలియపఱచబడిన) కాలముయొక్క ఏకత్వము, రంగముయొక్క ఏకత్వము నంతగా పాటింపలేదనుట నిశ్చ

యము. అంతమాత్రముచేత నవి యస్వాభావికములని చెప్ప వీలులేదు. గ్రీకు నాటక కర్తలు, ఫ్రెంచినాటక కర్తలు ఇట్టి ఏకత్వములను అనగా అభేదతలను ఎక్కుగా గౌరవించిరి. ఎలిజబెత్ కాలనాటక కవులు పాటింపలేదు. లెసింగు అను నొకజర్మను విమర్శకుఁడు ఇట్టి "ఏకత్వము" లను బంధముల విడనాడుట మంచిదని యభిప్రాయపడి యున్నాఁడు. షేక్స్పియరు గూడ వానిని పాటింపలేదు. నాటక కథావిధానమునందు కాలముయొక్క ఏకత్వమును రంగముయొక్క ఏకత్వమును గ్రీకుల తెచ్చిపెట్టినట్లు గనుబడుచున్నవి. వీనిని భారతనాటక విధానము విసర్జించుచున్నది. కాని భారతనాటక కర్త తననాటకమునందు నాటకోద్దేశానుసారముగా పాత్రలు తమతమ కార్యాచరణమునందు నేకత్వమును దృఢపఱచునట్లును భావములలోగూడ పరస్పర వైరుద్ధ్యములేక ఏకత్వము గలుగునట్లును వ్రాసియున్నాఁడు. నాటకములోని విషయములన్నియు కార్యకారణ సంబంధములుగల వగునట్లుగా జేయుటయే పాత్రల కర్మసిద్ధాంతమని హైందవనాటకకర్త యభిప్రాయ పడియున్నాడు. ప్రతినాటకమున కొక యంతర్భావముండును. దానిని నిరూపించుటకే నాటకమందు పాత్రలయొక్క కార్యాచరణ ఏకత్వము స్థిరీకరింపబడినది.

సంస్కృతనాటకములలో నివి విషాదాంత నాటకములనియు నివి సంతోషాంతనాటకములనియు ప్రత్యేక విభాగములు జూపబడియుండలేదు. ఆనాటకములలో ప్రత్యేకసమయములందు సంతోషవిషాదములు తరుచుగా గనుపట్టుచునే యుండును. సంతోషవిషాదములు రెండును సమ్మిశ్రములై యుండును. అంతియగాని నాటకమెన్నడును విషాదాంతముగనే వ్రాయబడి యుండలేదు. దౌర్జన్యవిషయములును ఉద్రేకపూరిత విషయములును రంగస్థలములందు ప్రదర్శింపరాదు. ఏలననగా శరీరములోని నరములకును మనస్సునకును నవియు ద్వేషము గలిగించి కలతబొందించును. గ్రీకునాటకములలో, విధి, వ్రాతపై నాధారపడిన యనేకవిషయములు వ్రాయబడియున్నవి. ఈవిధి వ్రాతలేక మన పురాతనకర్మము మనకేర్పఱచుకొని యున్నదే

యని హైందవనాటకకర్త నిరూపించుచున్నాడు. ప్రపంచమాయా వినాశనము మహానందముగా నెట్లుపరిణమించునో అట్లే బాధానుభవముయొక్క అంతము మేలుగా పరిణమించునని స్పష్టీకరింపబడి యున్నది.

అందుచేత భారతనాటక పద్ధతి హైందవ మతసంప్రదాయ సిద్ధముగానున్నది. పూర్వకాలమున స్పెయిను, గ్రీసు, ఇంగ్లండు, యిండియా, దేశములలో నాటకపరిజ్ఞాన మత్యున్నతస్థితియందుండెను. స్పెయిను యింగ్లండు దేశములలో ప్రపంచ విషయములకును మతవిషయములకును బరస్పర వైరుద్ధ్యముండెను. కాని గ్రీకునాటక పద్ధతివలె హైందవనాటక పద్ధతి మతోద్దేశముల స్పష్టీకరించుచున్నది. హైందవనాటక విధానము ప్రజలకౌన్నత్యమునకును పారిశుద్ధ్యమునకును నాధారభూతమగునట్లు ఏర్పఱచబడి యున్నది.

స్వాభావికముగా హైందవనాటకములు మొదట నాంది ఆశీస్సులతోను కొనకు భరతవాక్యముతోను మేళవింప బడునట్లు వ్రాయబడి యున్నవి.

హైందవనాటకములలోని కథలు సాధారణముగా మతగ్రంథములనుండియే కైకొనబడియున్నవి. మానవాతీతులగు దేవతలు, ఇంద్రుడు, విష్ణువు, మొదలగు పాత్రలు మన నాటకములలో జేర్పబడియున్నవి. వీనిని బట్టి మననాటకము లస్వాభావికములని చెప్పదగునా? షేక్స్పియరు తనయొక్క నాటకములలో పిశాచపాత్ర యొక్కటి జొప్పించి యున్నాడు. ఆపాత్ర ఆనాటకోద్దేశమును తారుమారు చేయుచున్నదా? మన జీవితములందు అగోచరముగ నుండియే మానవాతీత లేక స్వభావాతీత ప్రాణులు కొన్ని మనచేష్టలకు సంబంధించి యుండునని మనకు దెలియదా? అగోచరప్రపంచము దృగ్గోచర ప్రపంచము కలిసియే యీవిశ్వమానవ ప్రపంచ మగుచున్నదని హైందవుల యభిప్రాయము.

హైందవ నాటకములలో ప్రకృతి సౌభాగ్యము పూర్ణముగఁ జిత్రింపబడి యున్నది. గ్రీకునాటకకర్తలు, గోత్, షిల్లరు, హాప్టుమను మొదలగు

జర్మను కవులు, అంతకు మించిన షేక్స్పియరును పాత్రౌచిత్య నిరూపణ మునందు విశేషచాతుర్యము గనుబఱచిరి. వారి యొక్క దృక్పథము మానవునిపై బ్రసరించినది కాని హైందవనాటకకర్తయొక్క దృక్పథము ప్రకృతి వర్ణనముపైకి బ్రసరించినది. ప్రకృతియనగా మానవుని కుద్బోధము గలిగించునది యని మననాటకకర్త తలచి యుండెను. కనుకనే ప్రకృతి సౌందర్యమును జూపు వసంతఋతువు మొదలగు ఋతువుల పండుగలయందే ఆనాటకము లాడఁబడుచుండెడివి. నాయికా నాయకులయందు ప్రేమబీజముల నాటి వృద్ధిబొందించు మన్మథుడు లేక కామదేవుడు పుష్పబాణుడగు విలుకాడని కవులచే నూహింప బడియున్నది. కాళిదాసుని మహానాటకములలో ప్రకృతి సౌభాగ్యవర్ణనము మనోహరముగఁ జిత్రింపఁబడియున్నది. "విక్రమోర్వశీయ" నాటకములోని ప్రథమాంకము హిమవత్పర్వతమునందలి ప్రకృతి సౌందర్యమునే వర్ణించుచు ప్రారంభించుచున్నది. భవభూతి మహాకవి రచియించిన "ఉత్తరరామచరిత్రము" లోని రంగములు అరణ్యమునకు సంబంధించినవే. కాళిదాస రచితమైన "మేఘసందేశము" లోని నాయకుడగు యక్షుడు రత్నగిరి యనుపర్వత ప్రాంతమునకు వెడలిగొట్టబడియుండెను. దూరముననున్న తనభార్యకు మేఘునిచేత ప్రేమసందేశము నాయక్షుడు బంపియున్నాడు. రాజ్యమును వెడలి పోయిన రాముడు చిత్రకూటపర్వతము యొక్క ప్రకృతి సౌందర్యనిరూపకమైన శిఖరమునకు వెళ్లినట్లు వ్రాయబడియున్నది. అట్టి ప్రకృతి సౌభాగ్యమును జూపుపర్వతములయందు సంచరించిన రాముడును యక్షుడును ఎంతధన్యులు! వారు స్వదేశమునుండి వెడలగొట్టబడి జ్ఞానోత్పాదకమైన ప్రకృతిసౌందర్య మనుభవించి యున్నారు. మనమందరమును ప్రకృతి సౌందర్యమునకు విముఖులమై జనసమ్మర్ధముతో నిండిన పట్టణములలో నివసించుచున్నాము.

తరువాత, శకుంతల కుమారుడైన భరతుడు అరణ్యములో జన్మించినట్లు వ్రాయబడియున్నది. కాళిదాసుడు చనిపోయినవెనుక అతని శరీరము సగము సీలోను (లంక)లో సముద్రతీరమున నొకగుట్ట మీద బడియుండె

నట్లు పురాతనమైన జనశ్రుతిగలదు. "శాకుంతల" నాటకము ప్రకృతివర్ణనముతో నిండిపోవుచున్నది. నాటకములోని నాయికకు శకుంతల యనుపేరేల వచ్చెను? విశ్వామిత్రుడు తనబ్రహ్మచర్యమును విడనాడెను. ఒక సుందరశిశువు జనించెను. విశ్వామిత్రుడు పశ్చాత్తాపపడెను. ప్రాయశ్చిత్త మొనర్చుకొని మునీశ్వరుడు దైవధ్యాన నిమగ్నుడయ్యెను. విడచిపెట్టబడిన తన శిశువును పోషించుటకు ప్రకృతి దేవతను ప్రార్థించెను. నిద్రించుచున్న సౌందర్య స్వరూపిణియైన యాశిశువును శకుంతములు సాకెను. అందుచే శకుంతల యనుపేరు గలిగెను. ఈ శకుంతల అరణ్యములో ప్రకృతిశోభల వెదజల్లు నొక ఋష్యాశ్రమమందు పెరిగెను. ఆమె ఆశ్రమవృక్షముల బోషించుచు వానిని తన ప్రియసఖులుగా గౌరవించుచుండెను. ఆశ్రమ మయూరమునకామె యుపచారములు సేయుచుండెను. దుష్యంతుని కడకుబోవ ప్రయాణమైనప్పుడు శకుంతల తన ప్రియస్నేహితులైన వృక్షలతాగుల్మముల ననుజ్ఞనిమ్మని వేడుకొనెను.

ఆశ్రమములోని నిరపాయకరమైన లేడిపిల్లలను పక్షులను, నెమళ్లను సమీపించి అత్తవారింటికిబోవ ననుజ్ఞ వేడెను. ఆబిడ్డకు వారుమిత్రులే గదా! శకుంతల సాకుచుండినప్పుడు ఆజంతువులు ముఖ్యముగా నెమళ్లు ఆమె కాళ్లకు గఱచుకొని ప్రేమమును గురిపించుచు పోనీయకుండెను.

పూర్వకాలపు మన మహానాటకములన్నియు ప్రకృతి సాహచర్యము ననుసరించియే వ్రాయబడినవి. కనుకనే అవి మనస్సుయొక్క పరిశుద్ధతకును అభ్యున్నతికిని తోడ్పడుచున్నవి. కాని బాధానుభవములేనిది మనస్సునకు పరిశుద్ధత కలుగదు. ఆత్మీయత్యాగము లేకుండ ఆత్మగౌరవముఁ గలుగదు. ఈవిషయములను బాగుగ గుర్తించి హైందవ నాటకకర్తలు తమ నాటకములలోని నాయకులయొక్కయు నాయికలయొక్కయు చేష్టలచే వానిని వ్యక్తీకరించి యుండిరి. జీవితసమస్య వ్యక్తాలోచనచే గాక ఆత్మీయత్యాగముచేత విశదము చేయబడుచున్నది. ఆకాలములో బ్రహ్మచర్యాశ్రమమందుండు ప్రతివ్యక్తియును ఆత్మసంయమమును గూఢపరచవలసి యుండెను.

వానప్రస్థాశ్రమమునకు వచ్చునప్పటికి అతడు ఆత్మసంయమనమును వదలి ఆత్మీయత్యాగమును పెంపొందించుకొనవలసియుండెను. ఆత్మీయత్యాగపరాయణులైన వనములలో ఆశ్రమములందు నివసించు వానప్రస్థుల ఆత్మబలమును జూచి మహామహుఁడైన అలెగ్జాండరుకూడ నాశ్చర్యపడియుండెను. అతడు వానప్రస్థులను తనకు భృత్యులుగా జేసుకొనవలయునని యూహించెను కాని వృథయయ్యెను. వారు ప్రేమస్వరూపుఁడగు నాపరమేశ్వరునికే దాసులుగాని యితరులకు గాదు. ప్రపంచమంతయు జయింపదలపెట్టిన అలగ్జాండరయినను వారికి లెక్కలేదు గదా! పూర్వమనేకరాజులుగూడ అరణ్యములలో దైవధ్యానము చేయు నీఋషులయొక్క ఆత్మబలమును జూచి వారు గూడ నట్టిబలము సంపాదించుటకు రాజ్యముల వదలి అరణ్యములో ఆత్మజ్ఞాన దీక్షకై పూనుకొనిరి. గోత్ అను జర్మను దేశపు మహాకవి నాటకములవ్రాసి వానిలోని నాయికల చేష్టాప్రదర్శనముల వలన చదువరులు సంతోషించునట్లు చేసెను. కాని మన "శకుంతల" నాటకములోని శకుంతల పాత్రతో వారిలో నెవ్వరినైనను సరిపోల్పవచ్చునా యని నాకు సందేహముగ నున్నది. ఆత్మీయనిరాకరణమే యీ శకుంతల పాత్రకు గొప్పదనమును జేకూర్చుచున్నది. ప్రేమము వినోదము కొఱకు కాదనియు ఆత్మప్రవర్తన శిక్షణమునకై ఏర్పడినదనియు గ్రహించిన శకుంతలపాత్రను ఎంతపొగడ దగియున్నది! కష్టము లనుభవించిన తరువాత ప్రేమానందము కలుగునని ఆమె విశ్వసించియుండెను. అట్లే ఊర్వశియు కష్టానుభవము వలననే పవిత్రకావలసి యుండెను. పురూరవుడు అను నతడు గూడ కష్టపరంపరలతో ఊర్వశి కొఱకు వెదకివెదకి తుదకు ఆనందమును పొందెను.

"హనుమన్నాటక" మను వేఱొకగ్రంథములో గూడ నిట్టిభావములే తెలుపబడియున్నవి. లంకావిజయానంతరము హనుమంతుడు వానప్రస్థుడై తనజీవితమును గడపుచున్నట్లు వ్రాయబడినది. "నాగానంద" మను బౌద్ధనాటకములోగూడ నొక మహారాజునుగూర్చి యిట్లే వ్రాయబడి

యున్నది. ఈకాలమందు నాటకసంఘములు బయలుదేరి అన్నిచోటుల దిరుగుచు పై జెప్పబడిన భావములుగల నాటకములు ప్రదర్శించుట యుచితము. భారతయువకులు షేక్స్పియరు నాటకమును ప్రదర్శింప బ్రయత్నించిరి. కాని యది మనవారి హృదయముల కెక్కలేదు. షేక్స్పియరు నాటకము పరభాషలో నుండుటవలన అది మనభాషలోనికి తర్జుమా చేసినట్లయిన మూలగ్రంథమునకును దీనికిని కొంతభేదము గానిపించును. షేక్స్పియరు యూరపు దేశపు ప్రజాజీవితములను అనువాదములను ఆచారములను వ్యక్తీకరించి యున్నాడు. తమయొక్క జీవితానుభవములు ప్రజానుభవములు బాగుగా దెలిసికొని వాని కనుకూలముగా వ్రాసియుండుటచే పాశ్చాత్యదేశపు కవులు గొప్పగా నెంచబడియున్నారు. ఏ నాటకమయినను మనయాచార సంప్రదాయములు మన పూర్వవిజ్ఞాన నాగరకతలు చక్కగా దెలిసినవాడు వ్రాసినగాని మనకు మనస్సునకు నచ్చదు. గ్రీకులయొక్క ఆచారానుభవములనుబట్టి వ్రాయబడిన రోమనునాటకము రోమనుల మనస్సుల కెక్కియుండలేదు. మనకు మన ప్రజాసంప్రదాయముల కనుగుణముగా వ్రాయబడిన నాటకమే మనస్సున కెక్కును. మనపురాతన హైందవ వాఙ్మయమును ప్రజానుభవములను సూచించునట్టి జాతీయనాటకములు మనకావశ్యకమై యున్నవి. హిందూదేశపు జనసామాన్యమును ఉన్నత దశలోనికి తీసికొని వచ్చుటకు నాటకరూపమైన నూతన జాతీయాదర్శ మొకటి యిప్పుడు ముఖ్యముగా కావలసి యున్నది. మన హైందవ యువకులకు నూతనముగ వ్రాయబడెడు పురాతన భారతకథలు కావలసియున్నవి. వారు వీనివలన సత్యస్వరూపమును, ప్రేమస్వరూపమును, భజించుచుందురు. "కవిత్వమునకును సాంఘిక శ్రేయస్సునకును పరస్పర సంబంధముగలదు. అది ముఖ్యముగా నాటకములందే కనబడును. మానవ సంఘౌన్నత్యము నాటక చాతుర్యము ననుసరించియే పెంపొందింప బడునని చెప్పుట నిర్వివాదాంశము. ఏజాతియొక్క నాటకవిధానము రూపుమాసి పోవునో ఆజాతియొక్క సాంఘికప్రవర్తనములు రూపుమాయుచున్నవి. అప్పుడే సాంఘిక జీవనమునకు

గల ఆధారమంత యిక్కలిపోవుచున్నది" అని షెల్లి అను మహాకవి వ్రాసినాడు.

భారతనాటకపద్ధతి హిందూదేశమునే గాక ప్రపంచమునుగూడ నుద్ధరించును. ఏ యున్నతాదర్శములకు మతము మూలాధారముగ నున్నదో అట్టి ఆదర్శములను పాశ్చాత్యదేశమందు నేటికాలపు నాటక పద్ధతి విసర్జించుచున్నది. జర్మనీదేశ నాటకవిధానము జీవితముయొక్క నైతికాదర్శము నంతగా గనుగొనదు. "మనదేశములో నాడబడు నాటకములు జాతీయ నీతులను క్షీణింప జేయుచున్నందువలన యుద్ధభటులుగూడ నసహించుకొనుచున్నారు. నీతికి భంగము గలుగుచున్నపుడు జర్మను లూరకుండుట పాడిగాదు. ఇట్టి నాటక పద్ధతులను రూపుమాపవలెను" అని ఒక జర్మను విమర్శకుడు తమదేశపునాటకములను గురించి తనదేశీయులకే తెలియజేసెను. ఫ్రాన్సు దేశములోగూడ నిట్లేయున్నది. వివాహము, వివాహబంధ విసర్జనము, జారిణులకు బుట్టినవారియొక్క వారసత్వపు హక్కులు, మొదలగు విషయములగూర్చియే వ్రాయబడిన నాటకములు ఫ్రాన్సు దేశములో నీకాలమున ప్రదర్శింప బడుచున్నవి.

వీని నన్నిటినిబట్టిచూడ హైందవనాటక పద్ధతియే అభ్యుదయమునకు సహాయకారిగా గనుబడుచున్నది. యిరోపాదేశములోని నాటక దుష్పద్ధతుల బరిమార్చుటకును, మనుష్యునిలోని యీశ్వరత్వము నొక్కమారు ప్రపంచమునకు స్పష్టపఱచుటకును, మానవజీవితమంతయు కర్మసిద్ధాంతముపై నాధారపడియున్నదనియు ప్రకృతి సాహచర్యము మహానంద దాయకమనియు, ఆత్మీయత్యాగము సంస్తవనీయమనియును పాశ్చాత్య ప్రపంచమునకు తెలియజేయుటకును మన హిందూనాటక విధానము తన ఆదర్శప్రియత్వమును ముందిడుకొని సాగవలసియున్నది. ఎచ్చట సీతాదేవి నివసించి కష్టము లనుభవించెనో, ఎచ్చట శ్రీరామచంద్రుడు త్యాగమును ప్రేమమును ప్రవహింపజేసెనో, ఎచ్చట శకుంతల ప్రేమరసం బొలికించి కీర్తిగాంచెనో అట్టి భరతవర్షమునందు బుట్టిన ఋషులకు సంతతివారైన మనమందఱము

ఆత్మసందర్శనము గావించుకొనవలసియున్నది. పురాతన హైందవ సాహిత్యమునకును కళలకును ఎట్టిసౌందర్యదేవత ఆవహించి యుండెనో అట్టి సౌందర్య స్వరూపానందము మనమందఱ మాత్మపరీక్ష గావించికొని యనుభవించ వలసియున్నది. ప్రపంచమునకు నూతనశకము ప్రారంభమగు నీకాలమున పురోభివృద్ధికి హిందూదేశ మెట్లు సాయపడునో చూడవలసి యున్నది. కనుక, తామెవరో, ప్రపంచ కష్టనివారణ సందర్భమున హిందూదేశమును గూర్చి పరమేశ్వరుడేమి కోరుచున్నాడో, భారతీయులు జ్ఞప్తియం దుంచుకొనవలెనని హెచ్చరించుచున్నాను. భారతీయు లెచ్చటనుండినను ఏపని జేయుచున్నను నేటికాలమున దేశనాయకులే యుద్దేశములతో బాటుపడుచున్నారో, ఆయుద్దేశముల మనసునందుంచుకొని భరతవర్షమునకు శాంతి సౌభాగ్యములు జేకూర్చువిషయమై గట్టిప్రయత్నములు జేయవలెను. అవినాశకమైన హిందూదేశముపట్ల నెల్లరును గాఢవిశ్వాసము గలిగి యుండవలెను. మఱల నొకమారు మహర్షులు భారతీయులతో గలిసి పనిచేసెదరు. దేవత లగోచరులైనను భరతభూమిపై సంచరింతురు. ప్రేమతోడ (దేశ) భక్తి యొక్క పరిపూర్ణత్వమే ప్రాచ్యఖండ పాశ్చాత్యఖండ కష్టముల నివారింపజేయుటకు సాయపడును.

శ్రీ కృష్ణుని వేణుగానము.

శ్రీకృష్ణుని వేణుగానమేమి ప్రకటించినది? పూర్వకాలమున ద్వాపర యుగంబున శ్రీకృష్ణుడు తన మురళిని పెదవులమధ్యనునిచి యొక యూరి నుండి మఱియొక యూరికి బోవుచు మనోహరగానంబుచే నఖిల జనముల యొక్కయు గొల్లకన్నెలయొక్కయు మనస్సుల హరించి యెట్టిభావమును వ్యక్తీకరింప గలిగెను? ఆగానమునం దానందము తాండవించుచుండెను. అతని గురించిగాని అతని హృదయంగమ గానమును గురించిగాని వినిన ప్రతి మానవుని హృదయంబును ఆనంద రసప్రవాహమున మునిగి తేలుచుండెను. ఎవడు బంధితుడు గాడో అనగా ఎవడు ముక్తుడో వానికే ఆనందము గాని వేఱొకనికి గలుగదు. మనము స్వప్రయోజనపరులమై అధికార భవనముల నిర్మించుచున్నాము. కాని యవి చెఱసాల లగుచున్నవి, ఆత్మను బంధించుచున్నది. అధికారమును కాంచనమును ఆత్మగౌరవమిచ్చి తెచ్చికొనుచున్నాము. ఆత్మస్వాతంత్రమును గోల్పోయి మనము నిరర్థకమైన ప్రపంచానుభవములను గ్రహించుచున్నాము. ఉన్నతాధికారమునందుండుట యనగా బంధితుడై యుండుటయే గాని వేఱుగాదు. చెడుకోరికలు కోరుట, ఏకార్యమునైనను స్వప్రయోజనమునకై చేయుట, మనస్సు ధైర్యము లేక దుర్బలముగా నుంచుకొనుట అను మూడు బంధములను త్రెంపుడని స్త్రీ పురుషుల కందఱకును ఆనందభావగర్భితమైన శ్రీకృష్ణుని వేణుగానమాదేశించుచున్నది. పై జెప్పబడిన బంధములను త్రెంపి స్వేచ్ఛాజీవితము నడపుడని హెచ్చరించుచున్నది.

స్వాతంత్ర్యము గలవాడు లేక ముక్తుడుగా నుండు వానికి లక్షణము లెవ్వి? సాధారణముగా ప్రాణి లక్షణము లెవ్వి? లోన ప్రాణమున్నచో ఆశరీరి ఒకరికి మాఱు పలుకుచున్నది. గుఱ్ఱము చచ్చినచో నది యజమాని

యాజ్ఞల నెరవేర్పజాలదు. మానవుడు చచ్చినచో నతడు తనస్నేహితులు బంధువులు మొదలగు వారు చేయమనుకార్యమును జేయజాలడు. ప్రతిమనుష్యుని గుణావగుణములును, సాంఘికమైనట్టియో లేక తనవారు నెరవేర్చుచున్నట్టియో గుణముల ననుసరించియే యుండును. మనశరీర సౌష్ఠవాదులు మనపూర్వుల శరీర సౌష్ఠవాదుల ననుసరించియే యుండును. మనబుద్ధి మన చుట్టునున్న సాంఘికాచారములఁ బట్టియే ప్రవర్తిల్లుచుండును. కావున బ్రతికియుండుట వలన నితరులు జెప్పిన దానిని జేయుటయు గుణావగుణముల గ్రహించుటయు సంభవించుచున్నది.

సత్యస్వరూపుడైన పరమేశ్వరుని యాజ్ఞల నెరవేర్చుటకును ముక్తుని (స్వతంత్ర పురుషుని) జీవితమును నడపుటకును శ్రీకృష్ణుడు భగవద్గీతలో రెండువిషయములగూర్చి నొక్కి చెప్పియున్నాడు. తపోయజ్ఞములే (అనగా ప్రవర్తన శిక్షణము, త్యాగము) ఆరెండువిషయములు. తపస్సుజేయుడని అనుగుటతోడనే పరిహసింతురేమో. కాని తపస్సుజేయుడనియే మిమ్మును గోరుచున్నాను. సౌఖ్యభోగములతో మీరు చాలా కాలము గడపినారు. ఈవిషయము *సింధుదేశములో విశేషముగా కనుబడుచున్నది. మీరు భోగజీవితముల గడుపుచున్నారు. తపోమార్గమునకు రమ్మని మిమ్ముల బిలుచుచున్నాను. వివిధజాతుల చరిత్రముల జదువుడు. తపోమార్గులగు మహనీయుల దృఢనిశ్చయములే అనేకుల జీవితములలో మార్పులు గావించెను. మీరు ధనికుల వెంటబడుదురు. అట్టివారెన్నడును దేశోద్ధరణమునకై కడంగియుండలేదు. శ్రీకృష్ణుని మురళీగానము నిఱుపేదల యొక్కయు గోకుల బృందావనములలోని గొల్లపడుచుల యొక్కయు హృదయముల నాకర్షించెను. స్వతంత్రజీవనమునందు బాల్గొని మహోత్సాహము ననుభవించువారు గౌరవప్రేమములతో దులదూగు వినమ్రహృదయులే గాని అధికారగర్వముగల వారుకారు. తపస్సు యితరులకు

---

*వాస్వాని గారు నీయుపన్యాసమును సింధుదేశములో నిచ్చియున్నారు.

శ్రేయస్సు గలిగించుటకును సేవజేయుటకును శక్తి నొసంగును. విశేషమైన ధనమును విద్యయును గలిగిన వాడొకడుండు ననుకొనుడు. అతడు వాక్పటిమతోడను అధికారముతోడను మాట్లాడును. కాని మీమనస్సును అతని వాక్యములు కరగింపలేవు. కాని ఒక నిరాడంబరుడైన సాధువు సాధారణ వాక్యములు మీతో బలికినచో మీమనస్సున నొకవిధమైన యుద్బోధము గలుగును. ఎందుచేత? సాధువు తపోమార్గమందు నడచిన వాడు. అతడు చేయు కార్యములందును చెప్పుమాటలయందు తపశ్శక్తి ప్రవేశించుచున్నది.

అతపస్సునకు యజ్ఞమును మేళవింపజేయుడు. శాశ్వతుడైన పరబ్రహ్మమునకు యజ్ఞేశ్వరుడని పేరు. ఆ యీశ్వరునికి మీత్యాగము (యజ్ఞము) జూపి వానిచే నాశీర్వదింపబడుడు. యజ్ఞమనగా బయటికి గనబడుచు వైదికకర్మగాదు. ఈశ్వరార్పణాబుద్ధితో మీరు దేని నొసంగెదరో అదియే యజ్ఞమనబడును. కొంచెమేమి యొసంగగల మనెదరేమో వినుడు. నిశ్చయాత్మకమై యత్యాజమైన సద్భక్తితోనీయబడు పుష్పమైనను, పత్రమైనను కడకట్టి చిన్నవస్తువైనను పరమేశ్వరుడు గ్రహించుచుండగా మహాకార్యముల నెరవేర్ప మీరుద్దేశించుచుందురు. కాని ఘనతకై దేవులాడవలదని మిమ్ముల హెచ్చరించుచున్నాను. యథాశక్తి బ్రయత్నించి మీసంఘమునకు కొంచెమైన నుపయోగకారులుగానుండ బ్రయత్నింపుడు. ఆ చిన్నసహాయమే, ఆ చిన్న అనుతాపము, ఆచిన్న దయాకార్యమే, ఆచిన్న ప్రేమకార్యమే యజ్ఞమనబడును. అట్టి యజ్ఞమునే యజ్ఞేశ్వరుడు మిమ్ముజేయుమని కోరుచున్నాడు.

తపోయజ్ఞముల బలముచేత విశ్వప్రపంచమునకు మీరు మేలొనర్ప బ్రయత్నించినచో సర్వవస్తు ప్రదాతయైన పరమేశ్వరుని యొద్దనుండి కార్యసాధనశక్తి మీకు గలుగును. అప్పుడే మీజన్మములు సాఫల్యము జెందును. ఇందును గురించి ఒకపురాతన కథగలదు. పూర్వకాలమున పండ్లమ్ముకొని యొక స్త్రీ బ్రతుకుచుండెను. నీలమేఘచ్ఛాయ గలిగిన శ్రీ బాలకృష్ణుడు గుప్పెడు ధాన్యపుగింజలను దీసికొని ఆమెదగ్గరకుబోయి పండ్లిమ్మని యడి

గెను. అతని సుందరవదనమునకును శరీర లావణ్యమునకును జిలిబిలిపలుకులకును తప్పటడుగులకును ముల్లకనవ్వులకును మహానందము జెంది ఆమె తన బుట్టలోనిపండ్లన్నియు నొసంగెంచెను. అంతట ముద్దుకృష్ణుడు తనచేతిగింజలను ఆమెపైపు విసరివేసెను. అంతట నామె వానిని ఏఱుకొనగా నొక్కొక్కగింజ యొక్కొక్క అమూల్యమైన అభరణమయ్యెను. పై జెప్పబడిన దానికీ కథయే నిదర్శనము. మీరేది యీశ్వరుని కర్పింతురో దానికి వేయిరెట్లు ప్రతిఫల మనుభవింపగలరు.

మనమందరము మనజీవితముల నొకచోట నిక్షిప్తములుగాజేసి యుంచక బహిర్వివయ బాహుళ్యమునందు వికసింపజేయవలసి యున్నది. తపోయజ్ఞముల బలముచేత ఋషులసంతతి వారగు మీరందఱును నడుములు గట్టుడు. హైందవసందేశమును బ్రపంచమునకు వెల్లడింపుడు. పూర్వులను ఆర్యుల విజ్ఞానముగూర్చి దేశమున మఱొక్కమాఱు తెలియజేయుడు. ప్రపంచములోని వివిధజాతుల కదియే కావలసి యున్నది. ప్రపంచనాగరికత అదియే కోరుచున్నది. గర్వమును వీడుడు. అడకువ గలిగిన హృదయమును పశ్చాత్తాపమును నూతన మనోనిశ్చయములను గలిగి యుండుడు. ఆర్యావర్తమునందు పూర్వము మహనీయు లేఘనకార్యముల గావించిరో యిప్పుడు మీదుర్బల జీవితము లేమిచేయుచున్నవో గ్రహించుకొనుడు. పురాతన హిందూదేశము స్తుతిపాత్రమైనదనియు విజ్ఞానవంతమైనదనియు మీరనుచున్నారు. మీవంటి వారివలన పురాతన హిందూదేశము గర్వపడనేర్చునా? మఱియు మహోత్కృష్టమైన సంప్రదాయములు మీకుగలవని మీరనుకొనుచున్నారు. అట్టి మీరుచెప్పుకొను సంప్రదాయములను సరిగా నిర్వహించు కొనుభారము మీపై లేదా? మీపూర్వులు మహనీయులని మీ రనుచున్నారు. కాని మీచేష్టలవలన బ్రహ్మలోక సౌఖ్యమనుభవించు మీపితరులను దుఃఖపెట్టకుడు. మన ఆత్మయెడల మనము పాపమొనర్చితిమని యీశ్వరుని యెదుటను మానవుని యెదుటను మనమొప్పుకొనవలసి యున్నది. కార్యశూరులుగాని మతయొక్క వ్యర్థాలాపములవలన అపరమేశ్వరుడు బయటనే యుండి వర్షము

యొక్కయు తుపాను యొక్కయు బాధకునోర్చుచు మనకొఱకై కని పెట్టుకొని యున్నాడు. కనుక మనమందరము తపోయజ్ఞమార్గము లవలంబించి కార్యశూరులమైనచో మఱల నాపరమేశ్వరుడు భరతవర్ష హృదయమనెడి దేవాలయములోనికి బ్రవేశించి తన దయావంతమైన తేజమును మనలో నుద్దీపింపఁ జేయఁగలఁడు.

II.

క్రైస్తవులు క్రీస్తనియు, హిందువులు కృష్ణుడనియు, పరమేశ్వరుని పిల్చుచుందురని గ్రహించి యిర్వురియందు సమానగౌరవములు గలిగిన యొక యాంగ్లేయ స్త్రీ కొంతకాలము క్రిందట నాకొక యుత్తరము వ్రాసినది. దానిలో చివరమాటలు "Yours in Krishna & Christ" అని యున్నవి. అట్టి నిష్పక్షపాతబుద్ధి అందఱియందును లేదు. నేను కొంతకాలము క్రిందట లండను నగరములోనుంటిని. "క్రిష్టియను కామన్వెల్తు" అను పత్రికకు నే నొకమతవిషయిక వ్యాసమును వ్రాసితిని. అందులో పరమేశ్వరుడు ప్రపంచమున కంతటికి ఒకడేయనియు, యేసుక్రీస్తు, శ్రీకృష్ణుడు, బుద్ధుడు మొదలగు ప్రవర్తకులందఱి సిద్ధాంతములును ఏకేశ్వరోపాసనమే బోధించుననియు ప్రపంచములోని మతగురువు లెందరో పుట్టి చెప్పియున్నను వారందఱి మార్గమొక్కటే యనియు నేను వ్యాసములో వ్రాసి యుంటిని. హిందూదేశమునుండి తిరిగి వచ్చిన క్రైస్తవ మిషనరీ యొకడు లేచి యేసుక్రీస్తు నామముతో బాటు కృష్ణుని నామము నుచ్చరించుట తగదని కోపపడెను. అంతట నతడు శ్రీకృష్ణుని నడవడిని కఠినముగా విమర్శించెను. శ్రీకృష్ణుని నిందించినచో ఏసుక్రీస్తును ఘనతకు దెచ్చునని కొందరు మిషనరీల యుద్దేశము. నన్ను కోపపడిన నాతడు యీమిషనరీ వారిలో జేరినవాడే. క్రైస్తవదేశములలోని వారికి శ్రీకృష్ణుని ఆధ్యాత్మికమై, దురవగాహమైన లీలావిలాసములు దెలియవు. అందుచే నా లీలామానుష విగ్రహుని గూర్చి దురభిప్రాయము పడుచున్నారు. దురదృష్టవశమున నిట్టి దురభిప్రాయములె మన హిందూదేశములోని విద్యావంతులకు గూడ దోచుచున్నవి. శ్రీకృష్ణుని జీవి

తములోని కొన్నికథలు హైందవయువకుని నీతిని బుద్ధిని పాడుచేయుచున్నవని యొకరుచెప్పగా వానితో మనవారందఱో యేకీభవించియుండుటనే నెఱుఁగుదును. కాని హైందవ విశ్వాసమును నాశనముజేసినది శ్రీకృష్ణుని జీవితవిషయముల కావనియు ఆ మహనీయుడగు శ్రీకృష్ణుని పేరట పూర్వాచారపరాయణత్వము నందజేసికొని దుష్కార్యముల గావించెడి కొందఱి దుష్టహృదయములే అట్టి విశ్వాసమును శిథిలీభూతము గావించెననియు నేనభిప్రాయపడుచున్నాను. అదృష్టవశమున అట్టి దుష్టహృదయుల జీవితములును బోధలును కఠినవిమర్శనమునకు లోనయినవి. హిందూదేశముయొక్క పూర్వౌన్నత్యమునుగూర్చి యింకను విశేషముగా దెలిసికొని మనదేశములోని విద్యావంతు లిప్పుడిప్పుడు జ్ఞానము నొందుచున్నారు. శ్రీకృష్ణుని జీవితములోని యుద్బోధము, తత్త్వము గానాభిప్రాయము సాహసకార్యములు మొదలగునవన్నియు గ్రహింపదగి యున్నవి.

చాలకాలముక్రిందట సితాంపూర్ అను నొకగ్రామమందు ఆయూరి కాపువాండ్రు శ్రీకృష్ణనాటకమాడుట చూచితిని. నిజముగా ఆనాడు వారు చూపించిన శ్రీకృష్ణునిమీది భక్తియు, సంతోషమును వర్ణనాతీతము.

శ్రీరాముని గురించియు శ్రీకృష్ణుని గురించియు బుద్ధుని గురించియు హిందూదేశ చరిత్రమునకు సంబంధించిన యితర కథానాయకుల గురించియు నాటకముల రచింపజేసి ప్రదర్శించుచుండినచో దేశీయుల యుద్యమమున కదియెంతయు సహాయకారిగా నుండును. ఈపద్ధతి మతసిద్ధాంతములందున్న నిర్హేతుకమైన మూర్ఖ ప్రతిబంధముల తొలగించునట్టి యుత్కృష్టమైన ఆదరణీయత్వమును మనలో రగుల్కొల్పుటయే గాక పూర్వసంప్రదాయ సూత్రముల దాస్యమునుండి దేశమును విడిపింపజేయును. పూర్వకాలమునందు శ్రీకృష్ణుడు గొల్లలతో మిగుల స్నేహించెను. వారును నీతనిస్నేహమున మిగుల సంతోషించిరి. ఆకాలపు గొల్లపిల్లలును, గొల్లకన్నెలును శ్రీకృష్ణునియందెంత ప్రేమమును నిష్కాపట్యమును గనుబరచిరో అట్టి గుణములలో కొంచమైనను గలిగినవారు మాత్రమే శ్రీకృష్ణుని లీలామానుష జీవితమును నేటికాల

మునకు బనికి వచ్చెడి అతని మహాసందేశమును గ్రహింపగలరు. ౫౦౦౦ సం॥ల క్రిందట ఆర్యావర్తము సంక్షోభములో నుండుటచే శ్రీకృష్ణుని యుక్తియుక్తమైన సలహాలవసరమై యుండెను, అందుచే నతడు తన ప్రియమైన బృందావనమును వదలి మధురకు బోవలసి వచ్చెను. మురళీగానప్రియుడైన శ్రీకృష్ణుడు ఆర్యావర్త రాజకుమారులకు సలహాలొసంగ తన పల్లెయింటిని వదలి (రాజ) సభాభవనమునకు బోయెను. పల్లెకూటంబుల సుధామధుర గానంబుజేయుచు దీనుల యెడలను ఆపల్లెలకాపుల యెడలను దయార్ద్ర హృదయమును ప్రేమమును జూపుచు క్రీడావిలాసములలోనుండు శ్రీకృష్ణ భగవాను డొకమహారాజ్యాంగవేత్త యయ్యెను. తరువాత కొన్నాళ్లకు బృందావన వాస్తవ్యులు శ్రీకృష్ణుని జూచుటకు వెళ్లిరి. రాజబట్టలను ధరించిన కృష్ణమూర్తి సభాభవనములోనికి తేబడినవారి యెదుట గనుపడి కుశల ప్రశ్నముల వేయదొడంగెను. కాని యీవేషమునందుండు కృష్ణుని జూచుటకు వారికిష్టము లేకుండెను. అధికార సౌభాగ్యైశ్వర్యములతో దులతూగుచుండు నిట్టిశ్రీకృష్ణునితో ఆబృందావనవాసులకేమి పనియున్నది? అప్పుడు వారందఱును వానివంక జూడక క్రిందికి జూచుచుండిరి. గోపాలుడైన శ్రీకృష్ణునితో సంభాషించుటకు వారికి యిష్టముగ నుండెనుగాని రాజ్యాంగ వేత్తయైన శ్రీకృష్ణునితో సంభాషించుటకు వారికిష్టము లేకుండెను. ఇదంతయు శ్రీకృష్ణుడు గ్రహించి సభాభవనము మీది బట్టలను దీసివైచి నిరాడంబరమైన గోపాలకుని దుస్తులను ధరించి పట్టి పాదములతోడను, చేతులందు పిల్లగ్రోవితోడను, గాజోద్యాన వనమునకు పోయి ఆబృందావన వాసులతో మనోహరముగ బాడుచు క్రీడావిలాసముల ననుభవించెను.

ఆ శ్రీకృష్ణుని మురళి ఆనందరసమును వెల్లివిరయ జేయుచుండెను. అతడు పాడెడు సమయమందు గానమునువినిన ప్రతిమానవుని హృదయము పారవశ్యమున మునుగుచుండెను. స్వేచ్ఛా ప్రసారకమై దయావర్షకమైన ఆగాయకచూడామణి యొక్క గానధోరణి యెట్టిసందేశము దేశమున కిచ్చినది? యెవరు చెప్పగలరు? శ్రీకృష్ణునియొక్క ఆమనోహర గానమువ

రాధయును, గోపకులును యెట్లు జ్ఞప్తియందుంచుకొనిరో పూర్వచరిత్ర తెలుపుచున్నది. పెద్దవాడైన తరువాత కురుక్షేత్ర యుద్ధరంగమందు పాండవులు కౌరవుల నెదిరించు సమయమందు ఆశ్రీకృష్ణుడు తనయొక్క గాన సందేశమును లోకమునకు వెల్లడి చేసెనని కూడ పురాతన చరిత్రము తెలుపుచున్నది. ఆగానసందేశములోని ఒకవిషయముమాత్రమే మన భగవద్గీతయం దుద్బోధింపబడినది. అది కొంచమైనను యెంతజ్ఞానమును యెంత భావగాంభీర్యమును, యెంతయుద్బోధమును గావించుచున్నదో చెప్పతరము గాదు. శ్రీకృష్ణుని ప్రవర్తనమును విమర్శించు విమర్శకులు భగవద్గీతను చదివి హృదయములు పవిత్రము గావించుకొని ఆమహనీయుని చర్యలయందు గౌరవభావమును జూపవలసి యున్నది.

శ్రీకృష్ణుని మురళీగానావేశమును మాత్రము వ్యక్తీకరించునట్టి భగవద్గీతను జదివినంత మాత్రముననే ఆమహాత్ము డొకప్రత్యేకజాతికి గాక సమస్త ప్రపంచమునకు జెందినవాడని విశదము గాగలదు. గీతాగ్రంథము జాతిపక్షపాతముల నెచ్చట నుద్బోధింపదు. విశ్వవ్యాపియైన ఆపరమాత్మనుగూర్చియే తెలుపుచున్నది. ఆపరమేశ్వరుడు మామామతములకు జెందిన వాడని యూహించి అనావశ్యకముగా ప్రత్యేకత్వమును ఆయనకు దెచ్చిపెట్టుట యెంతమాత్రము మనకు దగినపనికాదు. శ్రీకృష్ణపరమాత్మ ప్రపంచమునకంతటికి జెందినవాడు. తనయుత్కృష్ట సందేశమును విచారగ్రస్తుడై సంశయాత్ముడైన అర్జునునికి యుద్ధరంగమం దుపదేశించెను. "శత్రుదమనుడైన అర్జునుడా! లెమ్ము. నీవిధిని నీవు నెరవేర్చుము." అదియే కదా ఆసందేశము. గౌరవాత్మకమైనట్టియు, ఆశాభరితమైనట్టియు, ఆదర్శప్రియమైనట్టియు, తత్త్వాన్వేషకమైనట్టియు, మనోదౌర్బల్యము గలిగినట్టియు, సంశయాత్మకమైనట్టి బాధకు వెఱచునట్టియు, కష్టానుభవమువలన పరమేశ్వర సౌభాగ్యమును గాంచ నిచ్చగింపనట్టియు, నేటి భారతీయాత్మకు ఆ శ్రీకృష్ణసందేశము అర్జునుని మూలమున నొసంగబడినట్లే కదా. "శత్రుదమనుడగు నర్జునుడా! లెమ్ము. నీవిధిని నీవునెరవేర్పు" మని శ్రీకృష్ణ

పరమాత్ముని ఆధ్యాత్మిక సందేశము అర్జునాత్మకు మైన హిందూదేశమున కొనసాగబడియున్నది.

ఆసందేశము నేటికాలపు భారతదేశమున కావశ్యకమై యున్నది. ఎందుచేత ననగా యీకాలమందే దుర్మార్గగుణము, భోగానుభవము, దురహంకారములు మున్నగునవి మన దేశనాగరకతను నిర్మూలము గావించినవి; ఈకాలమందే యంత్రములయొక్క ఏర్పాటు జాతీయజీవనమునకు హానిగలిగించుచున్నది. ఈకాలమందే దేశీయులు భూతదయను మంటిలో గలిపినారు. శాశ్వతప్రాముఖ్యముల పూజనమును సంపూర్ణముగ త్యజించినారు. కనుక నీకాలమందే శ్రీకృష్ణసందేశ మత్యావశ్యకమై కనుబడుచున్నది. దేశీయులు దాస్యమనుభవించుచున్నారు. సత్య, ధైర్య, ప్రేమగుణములు గలిగిన వారే యిప్పుడు కావలసి యున్నారు. వారే నడుములు బిగించి ఆధ్యాత్మిక జీవితముయొక్క సత్యస్వరూపమును గ్రహించి ప్రపంచమును పునర్నిర్మాణము గావింపవలెను. "పరంతపుడవగు నో యర్జునుడా! లెమ్ము. నీవిధిని నెరవేర్చుకొనుము!" కష్టమనుభవించుట సంభవించుచునే యున్నది. నీధర్మము మాత్రము శాశ్వతముగ నట్లే యున్నది. ఈ జీవితపు బోరాటమున బాల్గొనక సౌఖ్యలేశ మనుభవించుటకై ఆత్మస్వాతంత్ర్యము దెగనమ్ముకొనుట ఎంతమూఢత్వము! ఎంత తెలివితక్కువ?

ప్రపంచమంతయు నీసాయమునకై నిరీక్షించుచున్నది కాన "ఓపరంతపుడగు నర్జునుడా (ఓభారతీయుడా!) లెమ్ము. నీధర్మమును నీవు నెరవేర్పుము."

భారతీయుడా! మానవప్రపంచమునకు సేవచేయుటకై లెమ్ము. విశ్వవ్యాప్తియై నీగురువైన శ్రీకృష్ణపరమాత్ముడు మురళీగాన సుధామాధురిని వర్షించుచు నీయందనే యున్నాడు. అట్టి పరమాత్మయొక్క సందేశమును నెరవేర్ప—భారతీయుడా!—నీవు సాయపడెదవా!

విద్యా పునర్నిర్మాణము.

ప్రపంచముయొక్క పునర్నిర్మాణము ముఖ్యముగా విద్యావిధానమునందే కలదు. నేటికాలమున మనము చేతివృత్తుల నుద్ధరించు సమస్యను గూర్చి వినుచున్నాము. అనగా దానిలోని యర్థము ఇదివరకు ఇచ్చుచున్న కూలికంటె హెచ్చు కూలియనియా? లేక ఇదివరకుండిన పెట్టుబడికంటె హెచ్చైన పెట్టుబడి యనియా? వ్యాపారసంవిధానమా? యంత్రసామగ్రియా? కాని వీని యన్నిటికంటె ముఖ్యమైనది చేతివృత్తులలో నెట్లు సాధుత్వమును బెంపొందింపవచ్చునో, కార్మికులకును పెట్టుబడిదారులకును సఖ్య మెట్లుకుదురునో—అను రెండు విషయములు యోచింపదగియున్నవి. బయటికి గనపడు కొన్నిసూత్రములు లేక షరతులు పెట్టి చేతివృత్తులలో సాధుభావమును పెంపొందింప చేయుటకష్టము. వ్యాపారపు పెట్టుబడిదారులయందు తగిన సాంఘికజ్ఞానము కలుగునట్లు పలుమారు బోధించుచుండవలయును. పెట్టుబడిదారుల యొక్క అంతరాత్మకు ప్రబోధము కలిగిననేకాని ఈవిషయము సాధ్యము కానేరదు. హిందూదేశములో సాంఘిక సమస్యను గూర్చి మనము వినుచున్నాము. ఈవర్ణాశ్రమ ధర్మసమస్య మనలో చాలకాలమునుండి యున్నది. అది యిక నుండకూడదు. మనలోని నిమ్నజాతులు సంఘమునందు మనవలెనే సమానగౌరవమును పొందవలయును. మనలోనున్న అనేకులను పిరికిపందలుగా జేసిన ఈదురాచారము లన్నియు సమసిపోవలెను. ఈసమస్య విషయమైకూడ విద్యా ప్రబోధము ముఖ్యముగా కావలసియున్నది. మనకు గావలసినది ధనముగాని గొప్ప ఉద్యోగముగాని కాదు. కాని, నిర్మలమైన మనస్సు, సత్ప్రవర్తనము కావలసియున్నవి. వీనిసాధారము చేసికొనియే మన మొక నూతనవిధానమును దేశమున నెలకొల్పుటకు కోరుచున్నాము. ఇకను రాజకీయసమస్య యున్నది.

బాధ్యతాయుత ప్రభుత్వమను నూతనాదర్శము నియోజకవర్గమును విద్యావంతము చేయమనియే కోరుచున్నది. ప్రజాహిత ప్రభుత్వము కొరకై దానికి దగిన విద్యాప్రబోధము కావలసియున్నది. "అర్నెస్టు బార్కరు" అను వాఁడు చెప్పినట్లుగా మనస్సునకు విద్యాప్రబోధము కలుగజేయుటయే ముఖ్యమైనది. కాబట్టి మనస్సునకు విద్యాప్రబోధము కలుగ జేయుటవలననే విద్యాపునర్నిర్మాణ సమస్య నెరవేరవలసియున్నది.

ఈకాలమునందు ప్రపంచమునం దచ్చటచ్చట నూతనాదర్శములను బట్టి విద్యాసమస్య పరిష్కరించు ప్రయత్నములు జరుగుచుండుట మన సూచకముగా నున్నది. ఇంగ్లాండు దేశములో ఒక జాతీయ విశ్వవిద్యాలయమున్నది. ఇంగ్లండులోని వేల్సుభాగము విద్యాపునర్నిర్మాణము పట్ల మిక్కిలి శ్రద్ధను వహించియున్నది. దేశమందంతటను ప్రారంభవిద్య విస్తరింపవలెనని ఫిషరుగారి విద్యావిషయకమైన బిల్లు కోరుచున్నది. విద్యావిధానమునందు నూతనాదర్శములు నూతనోత్తేజము ముఖ్యముగా కావలసియున్నవని ఇంగ్లాండులో ఈమధ్య గావింపబడిన విద్యాసభలు వ్యక్తీకరించియున్నవి. కాని హిందూదేశములో విద్యాస్థితి నిరుత్సాహకరముగా నున్నది. ఐనను విద్యావిధానము పట్ల పునర్నిర్మాణము గావింపవలెననెడి యుద్దేశము మాత్రము మనదేశమునం దంతటను వ్యాపించియున్నది. జాతీయవిద్య కావలెనని చెప్పుటయు హైందవ విశ్వవిద్యాలయమునకు తగిన ఏర్పాటులు చేయ సమకట్టుటయు, ప్రతివ్యక్తియు విద్య నేర్చుకొనవలెననెడి నిర్బంధము దేశమున ముఖ్యావశ్యకముగా పరిగణింప బడుటయు— ఈ మొదలగునవన్నియు సంతోషసూచకములే. హిందూదేశము ఈవిషయమై కదలజారినది.

విద్యయొక్క ముఖ్యోద్దేశము మనస్సునకు శిక్షణము కలుగజేయుటయే. బెంతామ్ అనునొక ఆంగ్లేయకోవిదుడు మనస్సును పరిగణన సూత్రముతో సరిపోల్చినాడు. కాని ఈమనస్సు అను పదమును—మనస్సు బుద్ధి—అనురెండు సంస్కృతపదములయొక్క మొత్త మర్థమును తెలుపునట్లుగా వాడుచున్నాను. విద్యావంతుఁడైనవాఁడు ఆదర్శము ననుసరించి వస్తుఘనత

నిరూపించును. తెలివిగలవారు వస్తుప్రయోజనముల పరిగణింతురు. కాని విద్యాపరిజ్ఞానము గలవారు అనగా విద్యావంతులు జీవితముయొక్క ఆదర్శమును గూర్చి బాగుగా నెఱుంగుదురు. వారికి వస్తుఘనతల గూర్చి విస్తృతజ్ఞానము గలదు. విద్య జీవితవిమర్శనమునకై పనికి వచ్చునని తెలియుచున్నది. గుణదోష విమర్శనమే విద్యయని పిలువబడుచున్నది. విమర్శనమనగా వట్టి వాగ్వివాదముగాదు. ఔనది కాదని చెప్పుట కాదు. కాని జీవితస్థితిని మొత్తముగా పరిశీలించుటయే విమర్శనమని చెప్పబడును. పరీక్షలలో జయమొందుట విద్యయొక్క యుద్దేశమని మన యువకులనేకు లెంచుచుందురు. కాని పూర్ణతరమైన జీవితమును కొనసాగించుటయే విద్యయొక్క ముఖ్యోద్దేశమని వారు మఱచియున్నారు. విద్యావంతునికి మహోద్యోగము కాని ధనము గాని ప్రతిభను గడింపజాలదు. జీవితాదర్శము ననుసరించి మనుష్యులను వారివిషయములను పరిశీలించి విమర్శించు శక్తియే విద్యావంతునికి గావలసియున్నది. ఎంతయో పాండిత్యము ధనము అధికారము, చాతుర్యము గలిగి యుండినను యెవనికట్టి విమర్శనశక్తిలేదో, ఎవనికి జీవితమును మొత్తముగా పరిశీలించి విమర్శించు శక్తిలేదో అట్టివాడు నిజమైన విద్యావంతుడని చెప్పుటకు వీలులేదు. ప్రత్యేకముగా ధనలాభమునకై వెదకువాడు వట్టి తెలివిమాలినవాడు. "గుణవంతుడు" గా నుండ నేరడని యొక మహనీయుడు చెప్పియున్నాడు.

ఆదర్శముల ననుసరించి జీవితత్వమును విమర్శించుటయే విద్యయొక్క ప్రయోజనము. చదువరులారా! మీరు వాఙ్మయమునందు పాండిత్యమున్నదా? ఆదర్శముల ననుసరించి జీవితమును ప్రతిబింబింప జేయజాలని వాఙ్మయమువలన ప్రయోజనములేదు. షేక్స్పియర్ గ్రంథములలో నెంత జీవితజ్ఞాన మిమిడియున్నది! మీరు చదువు పురాణేతిహాసములు జీవితత్వము గూర్చియే చెప్పుచున్నవి. మీరు దేశచరిత్రము తెలుసుకొనుటలో పాండిత్యము గడించినారా? దేశచరిత్రముగూడ జీవితసందేశము నిచ్చుచున్నది. దేశచరిత్రమనగా, మహాపురుషుల జీవితతత్వములను తెలుసుకొనుటయే కదా!

మీరర్థశాస్త్రమును గురించి బాగుగా జదివియున్నారా? అర్థశాస్త్రమునకు సంబంధించిన మీపుస్తకములు యూరప్ అమెరికా దేశములయొక్క జీవితానుభవములను వ్యక్తీకరించుచున్నవి. నేటికాలపు నైతికజీవితమునకు అవి తగియున్నవేమో మీరు కొంచెము యోచింపవలెను. వేదాంతశాస్త్రమునందు మీకు పరిచయము గలదా? జీవితాదర్శముల పురస్కరించుకొనియే, ఆత్మసందర్శనమును పురస్కరించుకొనియే లేక జిజ్ఞాసువుల జీవితాలోకముల పురస్కరించుకొనియో వేదాంతశాస్త్రము వృద్ధిపొందుచున్నది. వేదాంతి ఆచరింపవలసిన విధులను గమనింపుడు. ఆవిధులకును అతనియొక్క అనుభవములకును ఎట్టిసంబంధము గలదో చూడుడు. అప్పుడే మీరు సత్యమును గ్రహింపగలరు. అద్వితీయుడగు ఆ పరమాత్మయొక్క సంపూర్ణత్వమును గూర్చి ఉచ్చరించుట కొతని యనుభవము లెంత చాలియుండదో, మీరు గ్రహింపగలరు. అట్టిజ్ఞానమే హైందవజీవితముతోడ మేళవింపజేసినదో నీదేశములో విద్యయొక్క పునర్నిర్మాణము జరుగగలదు. అనగా మనకు కావలసినది జీవితవిద్య మనదేశములోని ప్రస్తుత విద్యాపద్ధతిలో విషయములు జ్ఞప్తియందుంచుకొనుటకై యెక్కువ ప్రాముఖ్య మీయబడినది. ఇక మనము గావింపబోవు విద్యయొక్క నూతనపద్ధతి భారతదేశముయొక్క జీవితముతోడను అనగా ప్రజాజీవితముతోడను లేక జాతీయ జీవితముతోడను సంబంధము కలిగియుండునట్లుగా జేయవలెను. ప్రస్తుతవిద్యాపద్ధతి యెక్కువ కష్టపడునట్టియు తక్కువజీతము పొందునట్టియు గుమాస్తాలను ఉపాధ్యాయులను సృష్టించుచున్నది.

అరువదినాలుగు సం॥ ల క్రిందట జర్మనిదేశపు రాజధానియైన బర్లిను పట్టణములో నక్షత్రములు మొదలగు వానిని గురించి విశేషముగా తెలిసిన శాస్త్రజ్ఞులయొక్క సంఘమొకటి బయలుదేరి స్పష్టమైనట్టియు వర్ణనపూర్వకమైనట్టియు నొక మహాగ్రంథమును తయారుజేయ మొదలుపెట్టెను. వారు ఇప్పటికి మూడులక్షల నక్షత్రములయొక్క వివరములను ఇరువది మహాసంపుటములుగా వ్రాయగలిగినారు. ఈగ్రంథము ఆదేశజ్యోతిశ్శాస్త్ర

జ్ఞులయొక్కయు గణితశాస్త్రజ్ఞులయొక్కయు పూనికను దృఢపరచుచున్నది. ఏహైందవ విశ్వవిద్యాలయమైనను ఇంతవరకు ఇట్టిగ్రంథమొక్కటియైనను నెరవేర్చెనా? హైందవవిశ్వవిద్యాలయము లిచ్చు విద్యపరిశోధన కార్యములకు తగియుండలేదు. ఆలోచనపరులైన విద్యార్థులకు విద్యాసంగ్రహణాబుద్ధి పరస్పర సాహచర్యము కలిగించి అందరును తెలుసుకొనదగినటువంటి సత్యస్వరూపమైన పరమాత్మచే నిండినటువంటి ఈప్రపంచముయొక్క పూర్వాధునిక భావతత్వములను పరిశోధింప జేయుటకు నేటి హైందవవిశ్వవిద్యాలయము లిచ్చు విద్య పనికిరాదు. యూరప్ అమెరికా దేశములలో జాతీయ జీవితసూత్రము పట్ల శాస్త్రజ్ఞానము వినియోగింపబడుచున్నది. బర్లిన్ పట్టణములో కార్ఖానాలవంటి మహాగృహములు అనేకములున్నవి కాని యవి యన్నియు విశ్వవిద్యాలయ పండితులయొక్క విద్యాసంగ్రహణ పరిశోధన శాలలేకాని వేరుగావు. వీనిలోనే పూర్వము ప్రొఫెసర్ హాఫ్‌మాన్ అను నతడు పనిజేసి నీలిమందు తయారుజేయు పద్ధతిని గనిపెట్టి మనదేశములోని స్వాభావికమైన నీలిమందుయొక్క చేతకు హానిగల్గించెను. ముందుకాలమున వర్తకసంబంధమైన విశ్వవిద్యాలయములే భారతజాతికి లాభము జేకూర్చగలవు. ప్రస్తుతము హిందూదేశములో అట్టి విశ్వవిద్యాలయ మొక్కటియైన ఉన్నదా? ఇంతవరకు హిందూదేశ విశ్వవిద్యాలయములు దేశచరిత్రమునుగూర్చిన విమర్శనగ్రంథముల నెన్నిటిని వ్రాయింపగలిగెను? రసభావోత్పాదనమందు దేశీయము లనుపించునట్టియు పూర్వాధునిక నాగరకతను విమర్శించునట్టియు భారతదేశము సాహసకార్యముల యొక్క జయాపజయములను నిరూపించునట్టియు భరతవిజ్ఞానమును దెలుపునట్టియు మనదేశచరిత్రయొకటి ఇంకను వ్రాయబడవలసి యున్నది. ప్రస్తుత విద్యాపద్ధతి జాతీయ జీవనమునకు దూరముగానున్నది. పట్టపరీక్షయం దారితేరిన మనయువకులకు హైందవమహామ్మదీయ విజ్ఞానముగూర్చి రవ్వంతయు దెలియదు. పాశ్చదేశాభివృద్ధికై యూరప్ అమెరికా దేశములలోని విశ్వవిద్యాలయములు విద్యార్థులకు ఎట్టియవకాశములు గల్పించు

చున్నవో అట్టి యవకాశములు మన భారతవిద్యార్థికి లేవు. ఎంతవరకు స్వాతంత్ర్య మరికట్టబడియుండునో అంతవరకు మనభారత విశ్వవిద్యాలయములు విద్యాపునర్నిర్మాణము గావింపజాలవు. మనదేశములోని విశ్వవిద్యాలయములు స్వయంనిర్ణయ సూత్రమును ననుష్ఠింప వలయును. అభివృద్ధికై నిర్నిరోధమును విశ్వవిద్యాలయ జీవనముయొక్క ఔన్నత్యమును పెంపొందించును. హైందవ విశ్వవిద్యాలయములు నిజమైన జాతిస్వరూపమును గల్గియుండవలెను. అప్పుడే అవి దేశభాషా విశ్వవిద్యాలయములు కాగలవు. ఇంగ్లీషు భాషయొక్కగాని ఇతర ఐరోపీయ భాషలయొక్కగాని ఔన్నత్యమును గూర్చి నేను నిర్లక్ష్యము జూపుటలేదు. ఆంగ్లేయ వాఙ్మయమునందును ఆంగ్లేయదేశచరిత్ర రాజనీతి శాస్త్రములయందును ఎక్కువ విలువయున్నదని నేను విశ్వసించుచున్నాను. హిందూదేశమునకు తగినట్లుగా గొప్పస్థితియందుండ దలచినచో ప్రస్తుతకాలమునకు తగినట్లుగా తనజీవితవిధానమును వృద్ధిపొందించు కొనవలయును. రాజకీయ పరిణామ రూపకమైన ప్రస్తుతకాలమునందు ప్రభుత్వమువారితోడను ఆంగ్లేయజాతితోడను ఉత్తరప్రత్యుత్తరములు జరుపుకొనుటకై ఇంగ్లీషుభాష మనకవసరమై యున్నది. కాని స్వదేశభాషలను రూపుమాపి ఇంగ్లీషుభాష నేర్చుకొనవలసిన అవసరములేదు. కావలసినచో తమమాతృభాషకు తోడుగా ఇంగ్లీషుభాషను రెండవ భాషగా చేసుకొనవచ్చును. ఏకొలదిమందికోతప్ప విద్యను పరభాషలో నేర్పి విద్యార్థుల మనస్సులను పెంపొందింపజేయుట సాధ్యముకాదు.

మనకు పాశ్చాత్యదేశజ్ఞానము కావలసియున్నది. మనజాతీయ జీవనాభివృద్ధికై దానిని మనము సంగ్రహింపదలచినచో ఏరాష్ట్రములో నేభాష యుండునో ఆరాష్ట్రములో ఆభాషమూలముగా పాశ్చాత్యజ్ఞానమును మనము సంగ్రహింపవచ్చును. అప్పుడే విద్యార్థులు పెద్దవారై తెలివి తక్కువగా నితరుల ననుకరింపక జీవనమును సజీవమైన జాతీయతతో గడపగల్గుదురు. కాబట్టి మనదేశభాషలనుగూర్చి మన మెక్కుడు శ్రద్ధవహించవలెను. మనకు నిజమైన సజీవమైన జాతీయత అలవడినగాని మనజాతి ఉన్నతస్థితికి రానే

రదు. ఏజాతిలోనైనను అధికసంఖ్యాకులు ఒకేభాషమాట్లాడువారుగా నుందురో వారందరు పరభాషా నిమగ్నులై యుండునట్లు చేయుట స్వభావవిరుద్ధము. "స్వభావసిద్ధమైన ఆధారము ననుసరించి విద్యక్రమక్రమముగ నేర్పుచుండవలె" నని రస్కిన్ అను నతడు వ్రాసెను. మనదేశభాషలే "స్వభావసిద్ధమైన మన ఆధారద్రవ్యము." మనప్రస్తుత స్థితిని పూర్వస్థితితో మేళవింపజేయుటకు మనస్వభాషయే కావలసియున్నది. దేశముయొక్క పూర్వవిజ్ఞానమునుగూర్చి గుర్తెరుగక యిట్లే కాలము జరపినచో మనసజీవత్వమంతయు చెడిపోయి యితరుల ననుకరించి బ్రతుకునంతటి దుర్గతి సంభవించును. పరభాష మూలమున విద్య నేర్పినచో విద్యావంతులైన వారికిని జనసామాన్యమునకును మధ్య అనవసరమైన భేదభావములను గల్పించినవారమగుదుము. ఈ ఇంగ్లీషు విద్యవచ్చి హిందూదేశపు మానవ సముదాయముతోడ సంబంధము కలుగజేసుకొనని ఆంగ్లేయ భాషాపండితులగు హైందవజాతి నొకటి సృష్టించినచో అది దేశమునకు మహానర్థదాయకము. దేశభాషా విశ్వవిద్యాలయములు విద్యనురాష్ట్ర భాషల మూలమున నేర్పుటయే గాక భాషావాఙ్మయములయొక్క అభివృద్ధి నెంతయో సమకూర్చును.

పూర్వకాలపు భారతవీరులయొక్క జీవితాదర్శములు మనదేశభాషావాఙ్మయములలో వ్యక్తీకరింప బడియున్నవి. ఆంగ్లేయభాష నేర్చుకొని మాతృభాషను నిర్లక్ష్యముచేసిన వారియందలి గృహములలో బాలురు మహాభారత రామాయణాదులలోని వీరుల కథలను వినుచున్నారా? ఎన్నిగృహములలో బాలురు పూర్వకాలమున హిందూదేశమును ఉన్నతస్థితికి తెచ్చినట్టి వీరపురుషుల విజ్ఞానమునుగూర్చి నేర్చుకొనుచున్నారు? ఎన్ని గృహములలో మనజన్మభూమియందు బుట్టిన జాతీయగీతములు వినవచ్చుచున్నవి? ఒకవేళ యీ * సింధుదేశమునకు దేశభాషా విశ్వవిద్యాలయ మొకటి చాలకాలమునకు రావచ్చును. కాని యీ యూరిక కాలాలలో సింధుదేశ

* ఇది కరాచిలో నిచ్చిన యుపన్యాసము.

వాఙ్మయమునకు సంబంధించిన ఒక స్థానమును ప్రత్యేకించి యుంచుమని కోరుట తప్పగునా? వంగభాషకును దానివాఙ్మయమునకును సంబంధించిన ప్రత్యేకస్థానము కలకత్తా విశ్వవిద్యాలయములో నిదివరకేగలదు. చాలకాలమునుండి సింధుదేశములో విద్యావ్యాసంగము అస్పష్టముగా నున్నమాట వాస్తవమే. కాని మనసింధు రాష్ట్రమునకు సంబంధించిన జాతీయవాఙ్మయము లేక పోలేదు. సాలాటిఫ్, శామి, మొదలగు వారిగ్రంథము లనేకములు సింధుదేశవాఙ్మయమునందు గలవు. ఈకవులు రసోత్పాదకులు. ప్రకృతిని వారనేకవిధముల తమ గ్రంథములందు నుల్లేఖించిరి. సింధుదేశీయుల జీవనమునకు సింధుదేశ వాఙ్మయము నూతన మార్గము జూపింపగలదు. ఇతర రాష్ట్రములలో తమ దేశీయమైన స్వభాషావాఙ్మయమును పెంపొందించు ప్రయత్నములు జరుగుచుండు నీకాలముననే మన సింధుదేశవాఙ్మయముయొక్క పునరుద్ధరణమును గావింప వలెనని నేను కోరుచున్నాను. హిందూదేశములో నిప్పుడు మన మనుకొనునట్టి యూహాలే మునుముందు మహావిషయములు కాగలవు. సింధుదేశపు భాషయు, వాఙ్మయమును మునుముందు మన సింధుదేశీయుల భావ్యభివృద్ధికి నెట్లు సాయపడగలదో యీ సింధుదేశీయులందరు యోచించ వలసియున్నది.

విద్యాపరిణతచేత జాతీయజీవితమును పెంపొందింపజేయ దలచుకొన్నచో ప్రతిబాలుడును యీవిషయమై తనయొక్క కర్తవ్యములగూర్చి బోధింపబడవలెను. నేటికాలమున అనేకబాలురు చదువులేకున్నను జీవితము నెట్లో గడపుచున్నారు. వారిశక్తియంతయు వ్యర్థమగుచున్నది. నిర్బంధోచిత విద్యావిధానము లేనిచో విద్యాపునర్నిర్మాణము కొంచెమైనను సాగనేరదు. ఈ నిర్బంధోచిత విద్యవలన ఖర్చు ఎక్కువగునని తలపగూడదు. లాభనష్టములు జూచుకొను వర్తకపద్ధతిమీద ఏదేశము విద్యావిధానమునములలో పెట్టియున్నది? విద్య దేశీయసంపదకు మహాసాధనమని ఏదేశమునకు తెలియదు? విద్యావిధానపు ఖర్చునుగురించిన సమస్యనే చక్కగా యోచింపవలెను. ఈసమస్య—జాతీయ ఆదాయము సక్రమమైన అవశ్యక

కార్యములకై వినియోగింపబడవలెనా లేక ముఖ్యవిషయమైన విద్యా వ్యాపనముకై గాక యితర విషయములపై వ్యర్థవ్యయము జేయబడవలయునా—అనునదియే గాని వేఱుకాదు. పురాతనకాలమునుండియు భారతదేశాదాయము కొంచెముగానుండినను దేశీయులకు విద్య చెప్పించునెడల ప్రభుత్వము ఆదాయమును నిర్నిరోధముగా ఖర్చు పెట్టవలెనని హిందూదేశములో నందరి అభిప్రాయమైయున్నది. ఇంతియుగాక అందఱును చదువుకొనుటకు వీల్లు కలుగ చేయవలెననికూడ వారి అభిప్రాయమైయున్నది. ప్రతి మానవవ్యక్తికిని విద్య ముఖ్యావశ్యకమని హిందూదేశము విశ్వసించుచున్నది. భారతదేశ ప్రభుత్వమును మనము ప్రజాస్వామికముగా జేయదలచుకొనిన యీకాలమున ప్రతివానికిని విద్య ముఖ్యావశ్యకమయి యున్నది. విద్యార్థికి పదునాలుగు సంవత్సరములు వచ్చువఱకు పాఠశాలకు హాజరగుచుండుటకు అతనిని నిర్బంధింపవలెనని ఫిషర్ గారు చెప్పియున్నారు. కనడాదేశములో ప్రతిబాలుడును పదునారవసంవత్సరము వచ్చువరకు తప్పక విద్య నభ్యసించుచున్నాడు. జర్మనీదేశములో ప్రతివిద్యార్థియు యిరువదియొకటవ సంవత్సరము వచ్చువఱకు తప్పక విద్య నభ్యసింపవలెనని శాసింపబడుచున్నది. ఫ్రాన్సుదేశములోని విద్యాంశమంత్రి జర్మనీదేశములోవలెనే ఫ్రాన్సుదేశములోగూడ అట్టి విద్యావిధానమునే ఏర్పఱుప జూచుచున్నాడు. దేశములోని నూతన భావోదయమును ననుసరించి మనభారతీయులందఱు విద్యాపునర్నిర్మాణ విషయమై కృషి సలుపవలసియున్నది. ప్రతిపుట్టువాడును భావికాలపౌరుడుగా నున్నాడు. కనుక అతని మనస్సు, శరీరము, ప్రవర్తనము, వృద్ధిపొందుటకు తగిన అవకాశములు గల్పింపక పోయినచో దేశముయొక్క భావ్యభ్యుదయమును భగ్నముజేసిన వారమగుదుము. ప్రతిసంవత్సరము గావింపబడు ఆర్థికపత్రమునందు విద్యావిధానమునకై ఏర్పడు ఖర్చు విశేషముగానుండునంతవఱకు భారతవిద్యార్థులు మునుముందు నిజమైన పురుషత్వమును సంపాదించుటకు సాధ్యము గాదు. పల్లెలలోగాని, పట్టణములలోగాని నివసించు జనులందఱును విద్యనభ్యసించి తీరవలెను. విద్యాభ్యాస

మునకు పేదరికము ఆటంకముగా నుండగూడదు. పురాతనకాలమున గ్రీసుదేశములోను, మనహిందూదేశములోను గూడ విద్య ఉచితముగా నేర్పబడుచుండెను. ఈకాలమున గూడ పదియవశతాబ్దమున స్థాపింపబడిన కెయిరో విశ్వవిద్యాలయములో దూరదేశముల నుండివచ్చు సుమారు తొమ్మిదివేలమంది విద్యార్థులు విద్యను ఉచితముగా నేర్చుకొనుచుండిరి. అందులో అనేకులకు విశ్వవిద్యాలయమువారు భోజనాది సదుపాయములను ఉచితముగా చేసియుండిరి.

విద్యార్థులలో ఆటలయందుత్సాహమును పురికొల్పవలెనని నాయుద్దేశముగా నున్నది. మైదానములలో లేక ఆటస్థలములలో విద్యార్థులు తమ అప్రతిమానమైన శారీరక పరిశ్రమములందుత్సాహమును జూపవలసి యున్నది. తరగతులలో, ఉపాధ్యాయులిచ్చు నుపన్యాసములు, బోధించునట్టి ఆంగ్లేయవ్యాసరచన, గణితము, మొదలగు వానికంటె విద్యార్థులకు ఆటస్థలములే ఎక్కువ అభివృద్ధిని చేకూర్చునని నేనూహించుచున్నాను. విద్యయొక్క ఉద్దేశము విద్యార్థులను డబ్బుసంపాదించు యంత్రములుగా జేయుటకై యేర్పడినది గాదు. వారిని దృఢశరీరులుగా జేసి విజ్ఞానము అభివృద్ధిబొందించుటకై యేర్పడినది. విద్యయొక్క మూలాధారము శారీరక పటుత్వమునందే గలదనుజీవితము యొక్క ముఖ్యసూత్రమును పురాతన గ్రీకులు చక్కగా గ్రహించియుండిరి. నేటికాలమున, మన సింధుదేశపు విద్యావిధానము నాగరకతయు, పైజెప్పబడిన ముఖ్యసూత్రమునందు నిర్లక్ష్యభావమును జూపినవి. ఇంతకాలము నుండియు అనాదరము జూపబడిన శారీరకవిద్య మనపాఠశాలలలో విద్యార్థుల కిచ్చిననేగాని రాబోవు జాతీయ పునర్నిర్మాణమునందు మనపిల్లలుగాని, మనపిల్లల పిల్లలుగాని తగినట్లుగా పాటుపడజాలరు. జాతీయ పునర్నిర్మాణము ముఖ్యముగా మనపిల్లలపై నాధారపడియున్నది. తన ఆయుర్వేదగ్రంథమునందు పురాతన హిందూవైద్యుడైన శుశ్రుతుడను నాతడు బాలుర శిక్షణముయొక్క ప్రాముఖ్యమునుగూర్చి నొక్కిచెప్పియున్నాడు. భావికాలముయొక్క అభివృద్ధికి

బాలురే ముఖ్యాధారము. అత్యాశ్చర్య క్రియాపరుడైన యాపరమాత్ముడు తనయొక్క ప్రభావమునంతయు ప్రకృతిసౌందర్యముగా పరిణమింపజేయుచు దేశములోని విద్యార్థులకు జ్ఞానోపార్జనమునకై మహోపకారమును గలిగించియున్నాడు. మన విద్యార్థులను మంచి నేర్పుగలిగిన పురుషులనుగా జేయుటకు అట్టి అవకాశములను మనము గ్రహింపవలసి యున్నది. విద్యాపునర్నిర్మాణమునందు ప్రాచ్యదేశ వాఙ్మయము, భారతస్త్రీలు, నెట్టి ప్రాముఖ్యస్థానమును వహింపవలసియుండునో నాకిక జెప్పుటకు తగినంత అవకాశము లేదు. నాయుపన్యాసమును ముగించుటకుముందు నేనొక సంగతి మీకు చెప్పవలసి యున్నది. భారతదేశపు విద్యాపునర్నిర్మాణమునకై మీరు సాయపడదలచినచో మీజ్ఞానమును జాతీయసేవకై వినియోగింప వలసి యున్నది. జాతీయసేవకై కావలసిన ముఖ్యగుణములతో మీజ్ఞానమును మేళవింప జేయవలెను. ఆ ముఖ్యగుణములు, తెలివి, ధైర్యము, మితత్వము న్యాయము అనునవియే అని ఒకగ్రీకు మహానుభావుడు చెప్పియున్నాడు. వీనినిగూర్చియే శ్రీకృష్ణుడు అర్జునునకు భగవద్గీతయందు జ్ఞానమనగా త్యాగబుద్ధియే యని ఉపదేశించి యున్నాడు. పురాతన బైలు భాషయందు విద్యార్థులు ప్రవక్తలయొక్క కుమారులని చెప్పబడియున్నది. ప్రపంచసుఖమునకు బునాదివైచిన శాశ్వతుని మనము గ్రహింపవలసినది. జ్ఞానమనగా అత్యాదిబుద్ధియే యని మీరందరును గ్రహింపవలెను. జర్మనీదేశ విద్యయొక్క ముఖ్యోద్దేశ మధికారమేగాని వేరుకాదు. నెపోలియను తన బలమునకును కీర్తికొఱకై పాటుపడవలెనని ప్రబోధించెను. రోము రాజ్యనిర్వహణమునకై ప్రయత్నించియుండెను. స్పార్టాలోని బాలురు తమ మాతృదేశమునకు సహాయముచేయుటకై సైనిక శిక్షణము ముఖ్యావశ్యకమని ప్రబోధింపబడిరి. కాని మనభరతవర్షములోని విద్యార్థులకు జ్ఞానమనగా త్యాగబుద్ధి అనునొక నూతనసిద్ధాంతమును నేను చెప్పవలసి యున్నది. కలహ కారణమగు జ్ఞానము మానసంహారణమునకై వినియోగింపబడు శాస్త్రవిజ్ఞానము దేశమున కనర్థదాయకములు నేనుగోరు విద్యాభ్యుదయపారిశుద్ధ్యమును

గూర్చి చెప్పువిద్యయే గాని వేరుగాదు. నీదేశమునందు మానవులు మత జ్ఞానమును ప్రేమాత్మకమైన మానవసేవయందు వినియోగించి దుండగముల నిరసించుచు సత్యము నారాధించుచు ఎన్నికష్టములువచ్చినను ధర్మబద్ధులైయుందురో ఆ దేశమే బాగుపడును. ఈవిషయమే మనదేశములోని పురాతనగ్రంథములు చెప్పుచున్నవి. నేటికాలములో మనయొక్క మంచి యభిప్రాయములన్నియు మనపూర్వులు చెప్పినవేగాని వేరుగావు. ఆకాలపు "ఆశ్రమము"లలో సక్రమమైన విద్యావిధానము నిరూపింపబడియున్నది. ఆ ఆశ్రమములలో గురుశిష్యులు ఒక కుటుంబములోని వారివలె కలసిమెలసియుండిరి. గురువు శిష్యునికుమారుడుగా తలచెను. శిష్యుడు తనగురువును పరమభాగవతోత్తమునిగాను, విద్యానందాయకునిగాను తలచి భక్తితో పూజించెను. అతడు తనగురువుయొద్దనుండి త్యాగాత్మకమైన జ్ఞానమును సముపార్జించెను. అట్టి త్యాగమునకు ముఖ్యస్థానములు గురుశిష్యులు నివసించు పురాతనాశ్రమములే యని చెప్పవలసియున్నది. మనదేశములో నేడు నెలకొల్పబడియున్న పాఠశాలలన్నియు ప్రస్తుతయుగముయొక్క శాస్త్రజ్ఞానములు గలిగియుండి త్యాగాత్మకమైన జ్ఞానమునిచ్చు పురాతనాశ్రమములవంటి విద్యాలయములుగా మారవలయును. ప్రపంచ పునర్నిర్మాణమును సఖ్యతను సమకూర్చుటకై అట్టివిద్యాలయములు ఏర్పడి స్త్రీ పురుషులను ప్రతిదేశమునకును భారతసందేశమును గొనిపోవుటకు తరిఫీతు జేయవలసియుండును.

హైందవాదర్శములు.

పాశ్చాత్యదేశములన్నియు సైనిక సంపదనభివృద్ధిచేయుచు యంత్రసామగ్రి మూలమున వేనవేలు గడించుచు ధనాశాబద్ధములై యుండు నీకాలమున గూడ అచ్చటచ్చట కొందఱు భారతవర్షపు పురాణగ్రంథములయందును పూర్వఋషులయందును గొప్పతనమును గ్రహించి ప్రబోధితులగుచుండుట జూడ సంతోషావహముగ నున్నది. "సౌఖ్యమననేదియో మంచియనగ నేదియో దెలిసికొనలేక మనమందఱము పొరబడుచున్నాము. మనస్సునకు శాంతియు, ఒంటరిగ నివాసము చేయగల భాగ్యము లేకుండుటవలన మనలోని గొప్ప దయార్ద్రహృదయులుగూడ సౌఖ్యమన నేదియో తెలిసికొనలేక పొరబడుచున్నారు" అని ఒక ఫ్రెంచిగ్రంథకర్త వ్రాసియున్నాడు.

మనదేశములోని పూర్వకాలపు ఋషులు మనశ్శాంతికై విశేషముగ పాటుబడిరి. వారిగ్రంథములన్నియు మనవంటి జనసమ్మర్దమైన గృహములయందుగాక అడవులలోని పర్వత పరిసరములందు సెలయేళ్లప్రక్క శాంతిభూయిష్ఠమైన ఆశ్రమములందు వ్రాయబడినవి. యూరపుఖండము, అమెరికాదేశము, అధికారదర్పములకై నిరంతరము కృషిసల్పుచు ఆధ్యాత్మిక జీవితమును అణగద్రొక్కినవి. క్రీస్తుయొక్కయు, బుద్ధునియొక్కయు సందేశమును స్వార్థత్యాగమునుగూర్చి యూరపు అమెరికాదేశములకు ప్రబోధము చేయవలసి యున్నది. అట్టి సందేశమును యితరదేశములకు తీసికొనిపోవుట కొఱకే హిందూదేశము స్వాతంత్ర్యమును సంపాదింప ప్రయత్నించుచున్నది.

ప్రకృతిసౌందర్యము నవగాహనము జేసికొని తన సహజకవితా మాధుర్యముతో కవిపుంగవుడైన రవీంద్రనాథ్ ఠాకూరు అట్టి సందేశమునుగూర్చి యెల్లెడల దెల్పుచున్నాడు. ఆయనచే వ్రాయబడిన "గీతాంజలి"యను గ్రంథమును ప్రపంచవాఙ్మయోత్తమ గ్రంథములలో నొకటిగా నుండదగినదని

పాశ్చాత్యదేశస్థులు మెచ్చుకొనిరి. కర్మసిద్ధాంతమునుగూర్చియు హిందూదేశములో నెట్టి యభిప్రాయమున్నదో అట్టి యభిప్రాయమును గూర్చి ఈటు అను నొక ఐర్లండుదేశపు కవి చర్చించియున్నాడు. జేమ్సుస్టిఫెన్సు అను నొక కవి "పునర్జన్మముల" గూర్చి కొన్ని పద్యములను వ్రాసియున్నాడు. అల్జర్నన్ బ్లాకుడ్ అను నతడును వైలెట్ అను నతడును కలిసి ఒక నాటకము వ్రాసి అందులో కర్మ, పునర్జన్మ, సిద్ధాంతములగూర్చి విశదీకరించియుండిరి. ఆగ్రంథమునకు "కర్మ పునర్జన్మనాటకము" అను పేరిడిరి. దానిలోని నాయకుడును నాయికయు యీజిప్టు, గ్రీసు, యిటలీ, ఇంగ్లండు అను నాలుగుదేశములలోను నాలుగుజన్మములెత్తినట్లు వ్రాయబడియున్నది. ఈజిప్టులో వారవతరించి జీవించియున్నపుడు నాయకుడు పూర్వాచారపరాయణమైన వైదికకర్మవృత్తిలోనుండగా నాయిక వానిని బలవంతపెట్టి తనపై నెల్లపుడు అనురాగము జూపించుచు శృంగారచేష్టలలో నిమగ్నుడగునట్లు ప్రవేసించెను. తరువాత నాయికయు నాయకుడును అలెగ్జాండరు జీవించియుండు కాలములో గ్రీసుదేశములో పుట్టిరి. ఇప్పుడుగూడ నాయకుడు దనతో క్రీడలనుభవించుటకై దేశద్రోహమును గావించుటకు నాయిక మగనిని పురికొల్పెను. తరువాత ఇటలీదేశములో లారెంజో డి మెడిచ్చి కాలములోపుట్టి నాయకుడు తాను నేర్చుకొనిన కళలను దుర్వినియోగముచేసి తనతో క్రీడించుటకు ననేకవిధముల నాయిక ప్రోత్సహించెను. నాల్గవతూరి వారిద్దరు యీకాలపు ఇంగ్లండుదేశమున బుట్టిరి. అంతట తనతో అనురాగాంబుధి నోలాడుటకై, నాయకుని వేయనున్న యీజిప్టులోని గొప్పయుద్యోగమును మానుకొనుటకు నాయిక బలవంతపెట్టెను. కాబట్టి యిన్ని జన్మములలోగూడ స్త్రీయే పురుషుని లోబఱచుకొనుటకు వేధించుచున్నది. కాని పురుషునికంటె స్త్రీయే మునుముందు దేశాభ్యుదయమునకు పాటుబడవలయునని యభిప్రాయపడు మనకు పైజెప్పబడిన స్త్రీసాహసములు వచ్చును. ఎట్లైనను మానవుని ప్రవర్తనముయొక్క పాపపుణ్యము లనుసరించియే మును

ముందతనికి కష్టములుగాని సౌఖ్యములుగాని చేకూరునను సిద్ధాంతమును మాత్రమీనాటకము ప్రతిపాదించెను. కర్మయనగా మీరుచేయుపని. మీచేష్టలనుబట్టి మీరు కష్టసౌఖ్యముల మునుముం దనుభవింపవలసి వచ్చును. ప్రపంచముయొక్క శ్రేయస్సుకొఱకు మీరు నిష్కాములై సర్వస్వము వదలుకొని ఆత్మీయార్పణము గావింపకున్నచో పైజెప్పబడిన కర్మబంధము మీకు దొలగనేరదు. మానవులు తామేమో ఘనకార్యములు జేయుదుమని చెప్పుచుండుట సహజముగానున్నది. కాని జీవితప్రవృత్తి వేఱొకవిధమును జాటుచున్నది. ఏలననగా ప్రతివ్యక్తియు కర్మబంధముల ననుసరించియే ఆచరించును గాని వేఱుగాదు. ఈకర్మబంధము జీవుని నెప్పుడును వెంబడించియే యుండును. ఇట్లే దేశములపక్షమునగూడ జరుగుచుండును. పైజెప్పబడిన "పునర్జన్మ" నాటకములో యీజిప్టుదేశములో జన్మించినకాలమందు నాయికకు నాయకుడు లొంగిపోయెను. తరువాతవచ్చు ప్రతి జన్మమునందును తానేర్పఱచుకొనిన కర్మబంధమువలన నతడు పతితుడయ్యెను.

ఇంగ్లీషుభాషలో రైస్‌డేవిస్ అను నామె వ్రాసిన వేఱొక గ్రంథముగలదు. అదిగూడ భారతదేశ భావములను గొంచెము స్పష్టీకరించునని నేను విశ్వసించుచున్నాను. బుద్ధుని గురించి వ్రాయబడిన వాక్యముల నెన్నిటినో ఆగ్రంథము భాషాంతరీకరించి విశదపఱచెను. ఆగ్రంథమునందు జెప్పబడిన గురువు అరణ్యములో నొకచోట గూర్చుండి యుండెను. కాని మానవసంసర్గము కలిగియే యుండెను. ఎందఱో ఆయనదగ్గరకు వచ్చుచు బోవుచుండిరి. ఆతడు చెప్పునది వినుటకును ఆతనిముఖములోని శాంతసౌభాగ్యమును బరిశీలించుటకును ఆతడు చెప్పిన దానిని కార్యరూపమున జూపు సామర్థ్యము బొందుటకును వారాతని దగ్గరకు వచ్చుచుండిరి. "బుద్ధుడు ఉత్కృష్టమైన మహావాక్యముల గొన్ని పలుకుచున్నాడు గాన నిశ్శబ్దముగానుండు" మని ఆ వచ్చెడు వారిలో నొకతల్లి పిల్లవానిని మందలించెను. ప్రపంచశ్రేయస్సునకై ఆత్మీయార్పణము గావింపనిచో మానవునికి సౌఖ్యము లేదని ఆగురువు చెప్పెను. తరువాత చింతానిమగ్నుడైన యొక బ్రాహ్మ

ణుడు ఈగురువును జూచుటకై వచ్చి ఆతనిముఖ సౌభాగ్యమును జూచి “నేనుగూడ ఈతనివలె నుండుటమంచిది. అతనికి కష్టములులేవు. అప్పుల వాండ్రు వచ్చి నన్ను బాధించునట్లుగా ఈతనిని బాధించువారెవరును లేరు. కనుక సౌఖ్యవంతుడనగా నితడే” అని యాతడనెను. ఆ గురువులేక మహాత్ముడైన ఆబుద్ధుడు ఆత్మీయ పరిత్యాగపద్ధతియందు నడచెను.

లాఫ్ కాడియో అను నతడు “కర్మ” అను పేరుగల ఒక గ్రంథమును వ్రాసెను. జేమ్సుస్టి ఫెన్సు అను ఐర్లండు దేశపుమహాకవి శ్రీకృష్ణుని గురించియు గోపికలగురించియు దెలుపునట్టి యొక్క నాటకము వ్రాసెను. ఈగ్రంథముల నన్నిటినిబట్టిజూడ కొందరు పాశ్చాత్యదేశీయుల మనస్సులలోగూడ భారతదేశపు జీవితాదర్శభావములు కొంచెము కొంచెముగా తోచుచున్నవని గ్రహింపదగును. భారతీయులమని చెప్పుకొనుచు మహోత్కృష్టమైన మనపూర్వకాలపు దేశీయ విజ్ఞానమునుగూర్చి కొంచెమైనను తెలియనివారు మనలో ననేకులున్నారు. వీరివలెగాక ఎంతయో కృషిసల్పి పాశ్చాత్యదేశీయులలో కొందరు మనభారతదేశపు విజ్ఞానమును వాఙ్మయమును మతమును వేదాంతమును ఉపనిషద్రహస్యములను వేనోళ్ల బొగడుచున్నారు. రైస్‌డేవిస్ అనునామె వ్రాసినగ్రంథము బుద్ధునియొక్క జీవిత సందేశమును మిక్కిలి సులభరీతితో స్పష్టముగా వ్యక్తీకరించియున్నది. ప్రస్తుతకాలపు మనపోరాటములలో ఆగ్రంథము మనకు తగినసందేశ మిచ్చుచున్నది. అట్టి సందేశమునే ప్రస్తుతమానవ ప్రపంచము అభిలషించుచున్నది. ఏలననగా నేటికాలమున ప్రపంచమున నెక్కడజూచినను అశాంతి పెచ్చు పెరిగియున్నది. మనస్సుయొక్క అశాంతికి స్వార్థత్యాగమే సిద్ధౌషధమని బుద్ధుడు చెప్పియున్నాడు. హిందూదేశీయులు స్వాతంత్ర్య సంపాదనమునకై మనశ్శాంతిలేక నిరంతరము పోరాడుచున్నారు. కాని మనము ఆత్మీయార్పణ తపస్సునుగావించువరకు స్వాతంత్ర్యము పొందజాలము. అట్టి ఆత్మీయార్పణ తపశ్శక్తియే దేశీయులకష్టముల నివారించును. అప్పుడే ప్రపంచోద్ధరణమునకై హిందూదేశము మరల తలయెత్తును.

భక్తిమార్గము.

పూర్వకాలమున శ్వేతకేతువు అను పిల్లవాడొకడుండెను. అతనికి పండ్రెండు సంవత్సరములు వయస్సుండెను. అతనితండ్రి బ్రహ్మజ్ఞానమార్గమును గనిపెట్టుటకు బొమ్మని యాజ్ఞాపించెను. అంత ఆపిల్లవాడు వెళ్లిపోయెను. అత డిరువదినాలుగు సంవత్సరములు వచ్చునప్పటికి మరల తండ్రి గృహమునకువచ్చెను. అతడు ఎక్కువపాండిత్యము సంపాదించుటవలన విశేష గర్వమును గలిగియుండెను. తండ్రి అతనిదగ్గఱకు వచ్చి “శ్వేతకేతూ! పాండిత్యగర్వము నీకెక్కువగ నున్నది. ఓయీ! దేనివలన యిదివరకు నీవెరుగని మహాత్త్వదార్థమును గురించి తెలుసుకొనగలుగుదువో అట్టి జ్ఞానమును సంపాదించితివా?” అని పలికెను.

దేనివలన అవ్యక్తపదార్థము వ్యక్తమగునో అదియే బ్రహ్మజ్ఞానము. జ్ఞానమునకును, విద్యకును తారతమ్యమును మీరు గుర్తెరుంగుడు. విద్యయనగా పాండిత్యము. పాండిత్యము గడించిన వారు చాలమంది గలరు. వారందరికిని జ్ఞానములేదు. “జ్ఞానమనగా అంతరంగిక ప్రబోధము. దానిని పొందినవారు యెందరో యుండవచ్చును గాని వారందరకును విద్యయుండదు. శ్రీరామకృష్ణ పరమహంస జ్ఞానముగలిగినమహానుభావుడు. అతనికి విద్యాపాండిత్యము లేదు. కాని మంచి ఆత్మజ్ఞానము కలవాడు. అతడు సహస్ర రవిభాసమానమగు తేజఃపుంజమున ప్రకాశించు పరమాత్మయొక్క అనుభవమును బొందినట్టి పవిత్రచరిత్రుడు.

ఈజ్ఞానము అనేకవిధముల కలుగుచున్నది. కొన్నిసారులు శంకరాచార్యులకు వలెనే విషయములను గ్రహించుట కోరిక మూలమున గలుగుచున్నది. కొన్నిసారులు బుద్ధునికివలెనే పరుల కష్టములను గూర్చి విచారించుటవలన కలుగుచున్నది. కొన్నిసారులు సౌందర్య స్వరూపముయొక్క

స్థానమైనటువంటి శిల్పచాతుర్యము మూలమున కలుగుచున్నది. కొన్నిసారులు యీజ్ఞానము సుశ్లోకపఠనమువలన గలుగుచున్నది. ఇట్లే అనేకవిధముల యీశ్వర ప్రబోధము మానవుని మనస్సునకు తట్టి వానిని ఆధ్యాత్మిక జీవన మార్గమునందు నడచునట్లు ప్రేరేపించును.

అంతరములు వేరువేరుగా నుండినను ఆత్మానుభవము కలుగుటకు మార్గ మొకటే కలదు. ఆఒక్కమార్గమునందే కర్మ, జ్ఞాన, భక్తి, సిద్ధాంతములు అంతరములుగా గన్పడుచున్నవి. భక్తి, కర్మ, జ్ఞానము లనుమూడును ఒక దానిలోనొకటి కలిసిపోవుచున్నవి. కనుకనే పరమాత్మ జ్ఞానముచేత కలుగు నట్టి "అనురక్తి" భక్తి సిద్ధాంతములో నిమిడి యున్నది. ఆత్మానుభవము కలుగుటకై ఏర్పడిన ఒక్కమార్గముయొక్క భక్తి అనుఅంతరమునుగూర్చి నేనిక్కడ చెప్పదలచిసాను.

"భక్తి" అనుపదమునకు సరియైన ఇంగ్లీషుమాట నేను చెప్పలే కున్నాను. దాని కర్థము "విశ్వాసము" కాదు. పట్టి అభినివేశము కాదు. మనోధ్యానమునుకాదు. భక్తి అనుపదమునకు మనోహరమైన గంభీరార్థ మున్నది. కాని దానికి సరియైన ఇంగ్లీషుమాట చెప్పలేను.

పరమేశ్వరుడు ఆనందప్రేమ స్వరూపుడను సత్యమును గ్రహించు టయే భక్తికిముఖ్యమైన ఆధారము. ఈశ్వరుడు, పద్మనేత్రుడనియు, మను ష్యాతీతమైన సౌందర్య స్వరూపియని కపిలుడు చెప్పియున్నాడు. ప్రేమా నంద స్వరూపుడయిన భగవంతుడు మనల నాహ్వానించుచున్నాడు. భక్తి యనగా ఆయనయొక్క పిలుపునకు మానవునియొక్క ఆత్మ ఇచ్చునట్టి జవాబు. భక్తియనగా ఆనందముయొక్కయు సన్యాసముయొక్కయు మిశ్ర మము. సన్యాసమనగా మనజీవనాధారమునకు సంబంధించిన కుటుంబము, ఉద్యోగము మొదలగునవి విడిచిపెట్టుటకాదు. మనకుటుంబము, మన సంఘము, మనదేశము, మనస్వజాతి, మనప్రపంచము ఈ మొదలగు వాని నన్నిటితో మనకు పవిత్రమైన సంబంధము కలదు. బాహ్యరూపమైన వీని యన్నిటితో మనము సంబంధము వదలుకొనినచో ప్రపంచమునకు కీడుచేసిన

వారమగుదుము. ప్రపంచమనగా పరమాత్మయొక్క ఆనంద స్వరూపము గాదా ? సన్యాసమనగా అంతరంగిక సన్యాసమేగాని బాహ్యమైన సన్యా సము గాదు.

అంతరంగిక సన్యాసమనగా నేదియో కొంచెము చెప్పెదను. మొట్ట మొదట ఇంద్రియములను విషయానుభవముల పైకిబోకుండ నిగ్రహింప వలెను. ఈశ్వరతత్వము మనహృదయమున కెక్కుటకై ఇంద్రియము లేర్ప డును. కాని, మనలో ననేకులము ఈఇంద్రియముల మూలమున పాపమార్గ ములందుబడి దుర్విషయ భోగముల ననుభవించుచున్నాము. ఆనంద సౌందర్య ములతో నిబిడీకృతమైన ప్రపంచమందు ప్రేమమయ జీవియైన పరమాత్మ యొక్క సందేశముగల్గిన విషయానుభవములనే "భక్తుడు" పొందుచున్నా డు. ఈకనబడు ప్రకృతియందు భక్తుడు ఈశ్వరస్వరూపమును జూచు చున్నాడు. ఈప్రపంచము పరమేశ్వరునియొక్క మూర్తియని భక్తుడు భావించుచున్నాడు. అందుచేతనే ప్రకృతితోడి సాహచర్యము, ప్రాణుల యందు ప్రేమ మొదలగునవి అతడనుభవించుచున్నాడు.

తరువాత భక్తుడు తనలోనికోరికలన్నియు విసర్జించుటకు ప్రయ త్నించుచున్నాడు. ఇందుచేత నతనికే మనోభావములేదని చెప్పుటకు వీలు లేదు. భక్తునిహృదయ మెల్లప్పుడును భావపూరితమై యుండును. ఫలమను భవించుటకై ఏర్పడిన కోరికకును ఈశ్వరనిమిత్తమై ఏర్పడు మనోభావము నకును జాల తారతమ్యము గలదు. మనస్సులోని కామము ఆద్యంతసహిత మైన పదార్థమునకై దేవులాడును. పై జెప్పబడిన మనోభావము ఆద్యంతరహి తుడైన యీశ్వరుని నిమిత్తమై వినియోగింపబడును. భక్తుడు ఫలసహిత మైన కోరికల విసర్జించి భగవన్నిమిత్తమైన మనోభావములనే పెంపొందిం చును. భక్తుడు నిష్కాముడై యీశ్వరు నారాధించుచున్నాడు. "ఫలముల నాశించెడు కోరికలన్నియు హృదయబంధము" లని మన పురాతనగ్రంథ ములు చెప్పుచున్నవి. ఎవనికి పరమాత్మజ్ఞానముగలదో అట్టివానిచేత హృద యబంధములు త్రెంపబడును. "పరమాత్మను తెలిసికొనిన వెంటనే ఇంద్రి

యగోచరమైన దుర్విషయములపై కోరికభగ్నమై పోవుచున్న” దని భగవద్గీత చెప్పుచున్నది.

ఆత్మానుభవమార్గమందు నడచువాని ఫలసహితమైన కోరికలన్నియు అనగా హృదయబంధములన్నియు తమంతట తాము ఛిన్నాభిన్నమైపోవును. అధికారదర్పము, స్వప్రయోజన పరాయణత్వము కష్టసౌఖ్యములందు యితరులకు సాయపడని ప్రత్యేక జీవనాశక్తి అను వీనినుండి కోపము అసూయ మొదలగు దుర్గుణములు పనికిరావు. “పేదవారిమనస్సే శ్లాఘనీయ” మని యేసుక్రీస్తు చెప్పియున్నాడు. “గడ్డిపోచవలె అతివినయముగాను, వృక్షమువలె మిక్కిలి సహనముతోడను, యీశ్వరస్మరణము చేయవలె” నని శ్రీచైతన్యుడు చెప్పెను. అడకువయే జీవితౌన్నత్యమునకు మూలదుంప. ప్రాపంచిక విషయములైన మహోద్యోగ, అధికారధనముగూడ యీశ్వర సేవార్థమైన మనోభాగముగా మనము మార్చవలెను. మనప్రాణముమీద మనకు మిక్కిలి ప్రీతి. ఆత్మానుభవమార్గమం దెవడుండునో అట్టివాడు యీశ్వర స్వరూపమైన మానవసేవ నిమిత్తమై తనప్రాణముగూడ నర్పించుటకు సిద్ధపడియుండవలెను. స్వర్గలోకానుభవములకై అణిమాది అష్టసిద్ధులకొఱకై మనకు కోరికయుండవచ్చును. ఇట్టికోరికలుగూడ త్రెంపివేయవలెను. ఆత్మోద్ధరణమునకై భక్తుడీశ్వరసేవ జేయును గాని స్వర్గలోకానుభవమునకై కాదు.

కాబట్టి భక్తుడు గావింపవలసిన “సన్యాసము” ప్రపంచమునకు విముఖుడుగా నుండుటకాదు. ఈశ్వరస్వరూపాత్మకమైన మానవప్రపంచముతోడ ఆతనికి సాహచర్యముండవలెను. ఆసాహచర్యము ఆనందదాయకము. ఈశ్వరునియెడల భక్తునికికలుగు ఆనందము యింతింతయని చెప్పుటకు వీలులేదు. ఈశ్వరు నొక్కనిమిషము మరచియుండునట్టి తలంపే భక్తునికి దుఃఖదాయకముగ నుండును. ఈశ్వరునుండి దూరముగనుండుటకు భక్తుడిచ్ఛగింపడు. కనుకనే “నిన్ను మరువకుండుటయే నేగోరువరమ”ని పూర్వము ప్రహ్లాదుడు శ్రీనరసింహమూర్తితో బలికెను. ప్రపంచవిషయముల ఒత్తిడి ఎంతయున్నను భక్తుని హృదయమున ప్రేమానందములు పొంగి పొరలు

చుండును. దుర్మార్గులు శ్రీచైతన్యునిబట్టి ఆతనిపై రాళ్లురువ్వినపుడు ఆతడు వారిని కొంచెమేనియు కోపింపక మిక్కిలి ప్రేమతో వారినాశీర్వదించి యీశ్వరనామ సంకీర్తనము జేయుడని వారినుద్బోధించెను. మరియొకమారు యీశ్వరధ్యాన సమయమందు “ధనమునకై గాని, కవితాజ్ఞానమునకై గాని, ఒక సుందర స్త్రీకొఱకుగాని, నేనాశింపను. ఓజగన్నాయకా! నాయొక్క ప్రతిజన్మములోను నీయందు నాకద్భుతమైన భక్తియుండుటయే నేనాశించుచున్నాను.” అని శ్రీచైతన్యుడు పలికెను. ఈశ్వరునందట్టి భక్తియే నానకునకుగూడ నుండెను. “తామరపువ్వు నీటిని ప్రేమించినట్లే చేప నీటిని ప్రేమించినట్లే చాతకము వానచినుకును ప్రేమించినట్లే, మీరీశ్వరుని ప్రేమింపుడు.” అని నానకు ఉద్బోధించెను. మీరాబాయికికూడ యీశ్వరునియందిట్టి ప్రేమయేయుండెను. ఆమె దైవభక్తి కలిగియుండెను. తనభర్తచేత కష్టపెట్టబడినపుడుగూడ చలింపక “పరమేశ్వరుడు మనయెదుట నేయున్నాడు. నీవాతని రామణీయకత్వము జూడలేవా!” అని యీశ్వరభక్తి నిమగ్నయై భర్తనుజూచి పలికెను. ఆగ్రాలోని సూరిదాసు, తులసీదాసు, బాంకా అను యొక కట్టెలుకొట్టువానిభార్య, హరిదాసు, గోసాలుడు, కబీరు, తుకారాము, నందదాసు, మొదలగు వారందఱును అపారమైన యీశ్వరభక్తి తేక యీశ్వరప్రేమమునందు మునిగి తేలియుండిరి. పూర్వము శ్రీకృష్ణుడు ప్రేమపూరిత నేత్రులైన గోపికలయొక్కయు గోపాలురయొక్కయు భక్తిచేత ఆనందపరవశుడై తానుగూడ వారిపై కరుణారసము జిలుకుచు మనోహర వేణుగానములు గావించుచు వారిహృదయములు నిష్కల్మషములుగావున వారికి తనదర్శనమిచ్చి వారితో క్రీడించుచుండెను.

అట్టిప్రేమయే హిందూదేశమునకిపుడు కావలసియున్నది. అహింస దయ మొదలగు సద్గుణములకు బుట్టినిల్లగు యీప్రసిద్ధదేశమున అంతఃకలహములు, ప్రేమరాహిత్యము, మొదలగునవి యుండుట శోచనీయము. మతమను పేరుతో ఒకరికొకరము మనమందరము కలహించుచున్నాము. మతము ఒకరినుండి మరియొకరిని విడదీయుటకే గాక జీవితానుభవ శక్తుల సమ్మేళన

ము గావించుటకై యేర్పడినదని మనము మరచుచున్నాము. అయినను ప్రేమమయుడైన యీశ్వరుడు మన అండనున్నాడు. తనయొక్క స్వరూపమును మనఆత్మలలో మనముజూచుటకు యీశ్వరుడు తనవంకకు మనల బిలుచుచున్నాడు. విశ్వవ్యాపియైన భగవంతుడు విశ్వమానవ జీవనమునందు పాల్గొనుటకు మనలను పిలుచుచున్నాడు. విశ్వమానవ ప్రపంచమునందు ప్రేమము గలిగి స్వప్రయోజన రాహిత్యమును జూపించుటకు యీశ్వరుడు మనలను గోరుచున్నాడు "శ్రీకృష్ణమూర్తి తన వేణుగానముతో రమ్మని నన్ను పిలుచుచున్నాడు. నేను తప్పకపోవలెను. ఆయనకార్య మెంతకష్టమైనను నేను నెరవేర్చి తీరవలెను. ఆయన తనవేణుగానముతో నన్ను పిలుచుచున్నాడు. నేను తప్పక పోవలెను. ఎన్నికష్టములున్నను నేను వెళ్లితీరవలెను" అని యీశ్వరసందేశము నెరవేర్పబోవు భక్తుడొకడు పలికియున్నాడు. అట్టి యీశ్వరసందేశము మనకు వచ్చినది. మనమందరము ఆసందేశమునకై సిద్ధపడవలసి యుండవలెను. ఆసందేశము ప్రేమతత్త్వమును గానము చేయుచున్నది. ప్రాపంచిక సుఖానుభవములకై ఆశపడి మనమీశ్వరుని మరచిపోవుచున్నాము. భగవంతునికి మనపై నధికప్రేమము గలదు. అట్టి ప్రేమముచేత మనల నభివృద్ధికిదెచ్చి తనయొక్క పవిత్రస్వరూపమును దర్శనము జేయించును. ప్రాతఃకాలమునవీచు సౌఖ్యదాయకములగు కమ్మదెమ్మెరల కూడుగా శిల్పిశిఖామణియైన భగవంతుడుజూపు ప్రకృతివైచిత్ర్యము మీదుగా పవిత్రమైన ఆత్మశాంతతమీదుగా ఆగానసందేశము వచ్చుచునేయున్నది. ఆసందేశ నిర్వాహణమునకై కష్టమైనను సుఖమైనను మనము ముందంజవేసి తీరవలెను. ఎన్నికష్టములు వచ్చినను మనపనిని మనము నెరవేర్చి పెదవులమధ్య పిల్లనగ్రోవితో విరాజిల్లెడు ఆభగవంతుని మనము ప్రత్యక్షముగా సందర్శింప గలుగుదుము. అంతట పరమాత్మ స్వరూపముయొక్క అవిచ్ఛిన్న, అద్వితీయ, స్వయంప్రకాశిత, తేజస్సు మనయెదుట పొడగట్టును. అప్పుడానంద సారవశ్యమున మునిగి తేలుదుము.

యేసుక్రీస్తా లేక నాగరకతా?

అశాంతిగలిగిన పాశ్చాత్యదేశములజూచి చింతపడి వానిపై సానుభూతిజూపు భారతీయుడు ప్రస్తుత యూరపుఖండమునకు గలిగిన యిబ్బంది లెట్టివో విచారించుచున్నాడు. ఇదివరకెన్నడునులేని అశాంతి ప్రపంచమంతటను నేటికాలమున కనుబడుచున్నదని ఒప్పుకొనక తీరదు. యూరపుఖండపు నాగరకత నశించిపోవుచున్నదా? అను ముఖ్యమైన ప్రశ్నయొకటి గలదు. ఈప్రశ్ననుగూర్చి చాలమంది విచారించుటలేదు. సర్వదేశ సందర్శనానుభవము గలిగిన రవీంద్రనాథ ఠాకూరు, రోమైన్‌రోలండు, అబ్దుల్‌బాహా, అను యేకొలదిమందియో పైప్రశ్ననుగూర్చి విచారించుచున్నారు. పాశ్చాత్యదేశములన్నియు మహాధికారమును సంపాదించు నిమిత్తమై కృషిసల్పినవని గతించినయుద్ధము దృఢపఱచుచున్నది. శాస్త్రీయ, పారిశ్రామిక వైజ్ఞానిక వైభవములుగలిగిన పాశ్చాత్యదేశము ఎట్టి మహాపరాధముల చేయగలదో నిరూపించుచు ఒకజర్మను దేశస్థుడు రెండుగ్రంథములను వ్రాసెను.

సంధిసభవారు గతించినయుద్ధములో ఏఏదేశములెట్టి ఘోరకార్యములజేసెనో విచారించుటకై విచారణసంఘము నొకటి నియమించిరి. ఆవిచారణసంఘమువారు జర్మనుదేశపు పాలకవర్గము, సేన, నావికాదళము, గావించిన ముప్పదిరెండు మహాపరాధములగూర్చి యిప్పుడు బైటబెట్టియున్నారు. విరోధి ప్రజలను హింసపెట్టుట, అన్నములేకుండ వారికి కడుపుమాడ్చుట, స్త్రీల చెరపెట్టుట, బలవత్సంగమము జేయుటకై స్త్రీలను బాలలను ఎత్తుకొనిపోవుట, మంచినీటిబావులలో విషముగలుపుట, నరహత్యలజేయుట, ఆసుపత్రులను ధ్వంసముచేయుట మొదలగునవెన్నియో జర్మనులు గావించిరి. ప్రస్తుతకాలమునందు చాలదేశములు వర్తకబలమును, సైనికబలమును, నావికబలమును, సముకూర్చియున్నవి. కాని ఒక్క మహా

న్నతమైన మానవసంఘమును స్థాపింపగలిగినవా ? లేక వాని నాగరికతయుం తయు పరస్పరవిరోధ కలహములపై నాధారపడియున్నదనుమాట నిజమని చెప్పవచ్చునా? "మనము గావించుకొనుసంధి జయముపొందిన దేశములన్నిటిలో శాంతి స్థాపించునదిగా నుండవలెను. యేడుకోట్ల జర్మనులు ఫ్రాన్సుదేశమునకేగాక ప్రపంచమంతటికిని ఉపద్రవము గలిగింతురు." అని యీ మధ్య మార్షలుఫోషు సేనాని యంతటివాడు పలికియున్నాడు. కాని ఆదేశములకై కావింపబడిన సంధి మునుముందు ప్రపంచాభ్యుదయమునకు దోడ్పడునా! మధ్య యూరపునందు గావింపబడిన ముట్టడియొక్క పద్ధతియే పైప్రశ్నకు వ్యతిరేక సమాధానమిచ్చుచున్నది.

యూరపుదేశములోని సాంఘిక వాదమంతయు తిండికిలేక ఏర్పడినట్లు కనుపడుచున్నది. అదియే తీవ్రమైన బొల్షివిజము స్వరూపమును దాల్చి చదువుకొనినవారి మీదను డబ్బుగలవారిమీదను, నాటకపు జనమును కలహించుటకై నేటికాలమున పురిగొల్పుచున్నది. ప్రాచ్యఖండముయొక్కయు పాశ్చాత్యఖండముయొక్కయు ఐకమత్యమునకై ఎదురుచూచునట్టి మనయొక్క విశ్వాసమును ధ్రుఢపరచుటకై ఆఫ్రికాజాతులు ఆశియాఖండపు జాతులు, తదితర ప్రపంచజాతులు అన్నియుగలసి సహోదర భావముతో ప్రవర్తింప ఒక "జాతిసమితి" ఏర్పడవలెనని కీర్తిశేషుడైన కేశవచంద్రసేనుడు పలికియున్నాడు. కాని పాశ్చాత్యఖండమున నిప్పుడున్న 'జాతిసమితి" వివిధ దేశపాలక వర్గములయొక్కయు, పాశ్చాత్య మహాశక్తులయొక్కయు, ప్రాతినిధ్యమును వహించినదై కేశవచంద్రసేనుని ఆదర్శమునకు వ్యతిరేకముగ నున్నది. యూరపుఖండము నిస్సందేహముగా అనేక విషయములలో అగ్రస్థానము వహించియున్నది. వర్తకవిషయమునగాని, శాస్త్రపరిశోధన విషయమునగాని, తదితర విషయమునగాని ఆఖండమున్నతస్థితియందున్నది. జాతీయ స్వాతంత్ర్యముయొక్క ఆచారములు ఆఖండమునందెల్లెడల గన్పట్టుచున్నవి. కాని ఇట్టిగొప్పదనమునకు, యిట్టి విజ్ఞానమునకు మించిన ఉత్కృష్టతరమైన ఆదర్శమొకటి లేకున్నచో

అది ద్వేషమును, కలహములను గలిగించుచుండును. ఆఉత్కృష్టతరమైన ఆదర్శము "మైత్రి" అనెడు విశ్వమానవ సౌహార్ద్రగుణమే గాని వేఱుగాదు. అట్టి 'మైత్రి' అను సుగుణము లేకయే యీకాలమున వివిధజాతులు పరస్పర కలహములు గావించుకొనుచున్నవి. ప్రష్యాదేశములో విజృంభించిన సామ్రాజ్యభావము "మైత్రి" అను సుగుణమును రూపుమాపినది. ఆసామ్రాజ్యభావము అధికారదేవతను నారాధించెను. ఒకవిధమైన జాతీయతను బెంపొందించెను. యుద్ధమును, రక్తపాతమును గూర్చి కీర్తించెను. ఇట్టి సామ్రాజ్యభావమే, యిట్టి అధికారవాంఛయే నేటికాలమున ప్రపంచాభ్యుదయమునకు నిరోధము గలిగించుచున్నది. జాతీయాహంకారము, ఎవరి జాతులు వారు ఘనతరములని చెప్పుకొనుట, ఇతరజాతుల మనక్రింద నుంచుకొనవలెనను బుద్ధి యీ మొదలగునవన్నియు అట్టి అధికారవాంఛను, అట్టి సామ్రాజ్యభావమును బెచ్చుపెరుగ జేయును. "జాతిసమితి" అంతర్జాతీయ సమానతలను దృఢపఱచవలెనని సంధిసమావేశ సమయమునందు జపానుదేశ ప్రతినిధు లుపపాదింపగా ఆస్ట్రేలియా దేశీయులు దానిని ప్రతిఘటించిరి. అధికారవాంఛకు దోడునీడయిన జాతీయాహంకారము జపానుదేశమునకుగూడ గలదు. కొలది దినములక్రిందటనే కొరియాదేశస్థులు దేశీయసమావేశము గావించి కొరియాదేశములోని జపానుపరిపాలనము దౌర్జన్యముతో గూడుకొన్నదనియు, జపానుదేశము ఆశియాఖండపు ప్రష్యాదేశమే గావి వేఱుగాదనియు స్పష్టముగా దీర్మానించియుండిరి. కొరియాదేశములోని అశాంతియు, ప్రజల సాత్త్వికమైన తిరుగుబాటును పరిశీలించినచో జపానుదేశపు అధికారవాంఛయు జాతీయాహంకారము తేటతెల్లమగును.

యూరపుఖండమునందు మనదేశీయులు సంగ్రహింపవలసిన విషయములనేకములున్నవని మనమొప్పుకొని తీరవలెను. తాను అభివృద్ధికి రాదగిన మార్గములన్నియు యూరపుదేశము కనిపెట్టెను. అభివృద్ధి నిరోధకమైన దేశాచారములను విడనాడెను. యూరపుదేశమునందు విజృంభించిన శాస్త్ర

ము యితర సంవిధానములు మన కుపయోగ కరములుగా నుండును. మన విమర్శనశక్తిని పెంపొందించుకొనుటకు యూరపుదేశపు సాయము అవసరమైయున్నది. జాతీయపౌరుషమును మన మింకను గావించుకొనవలసి యున్నది. ఏస్వాతంత్ర్యభావము ఆంగ్లేయజాతిని ప్రపంచవివిధ జాతులలో ముఖ్యమయినదిగా పరిగణింపబడునట్లు జేసి కనడా, ఆస్ట్రేలియా, దక్షిణ ఆఫ్రికా, పోలెండు, ఫిన్లండు, మొదలగు దేశములకు స్వయంనిర్ణయ సూత్రమును ప్రసాదించుటకు యింగ్లండుదేశమును సమ్మతించునట్లు చేసెనో అట్టి స్వాతంత్ర్య భావముయొక్క ప్రభోదము మన కక్కరలేదా? అస్వయం నిర్ణయ సూత్రమును హిందూదేశమునకు యింగ్లండుదేశ మింకను వర్తించునట్లు జేయలేదు. పూర్వకాలమున మనదేశపు ఆర్యులు ప్రజాస్వామ్య భావములను బరిపూర్ణముగ గ్రహించియుండిరని ఆంగ్లేయులకు దెలియదు. స్వయంనిర్ణయ సూత్రమును హిందూదేశమున కెన్నడో ప్రసాదించుటకు యింగ్లండుదేశ ముప్పుకొనుచునే యున్నది. కాని ఆయుద్దేశము మందముగ నున్నది. స్వాతంత్ర్యభావములు గ్రహించియున్న ఆంగ్లేయ సామ్రాజ్యము తెల్లవారు, నల్లవారను వర్ణభేదమును యింకను పాటించుచునే యున్నది. విశ్వమానవ ప్రపంచము యీశ్వరస్వరూపమనియు అందఱు సమానులనియు యింగ్లండుదేశము గ్రహింపవలసి యున్నది.

జాతిభేదమును పాటించుకొని ప్రపంచమున కలతలు జరుగుచునే యున్నవి. దీనికి తోడునీడలగు జాతీయ అహంకారముచేతను, అధికారవాంఛచేతను, పాశ్చాత్య నాగరకత చెడగొట్టబడుచున్నది. ఏదేశము తన రాజ్యమును విస్తరింపజేయుటకును, పరదేశభాగ్యమును క్రమక్రమముగ సంగ్రహించుటకును, పరదేశమును తనక్రింద నుంచుకొనుటకును, ఉద్దేశించి యితర జాతులతో విరోధముపూని తనజాతియొక్క ప్రత్యేకత్వమును నిరూపించుకొనుచుండునో ఆదేశము నీచముగా ప్రవర్తించుచున్నదని చెప్పవచ్చును. ఏజాతి ప్రపంచ సౌఖ్యానుభవములకైగాక మానవసేవజేయ సముకట్టి అత్యున్నతస్థితికై ప్రయత్నించుచున్నదో ఆజాతి సన్మార్గమునందు నడచు

చున్నదని చెప్పవచ్చును. ప్రతిభారతీయుడును తాను భారతీయుడని గ్రహించుటయేగాక ఆంగ్లేయ జాతియందుగల మంచివిషయములన్నియు గ్రహింపవలసి యున్నది. ఆంగ్లేయుడు తానాంగ్లేయుడనని గ్రహించుటయేగాక భారతీయ విజ్ఞానమునుగూర్చి మెచ్చుకొనవలసి యున్నది. తెల్లవారు, నల్లవారు అనుభేదమును అతడుంచుకొనగూడదు. హిందూదేశము ఆశించునట్టి అభివృద్ధికై ఆంగ్లేయుడు తనయొక్క సమ్మతిని జూపవలెను. అట్టివారే విశ్వమానవ సౌభ్రాతృత్వమును గ్రహింపగలరు. వారే ప్రపంచ పౌరులు. ఎట్టి విశ్వమానవ ప్రపంచముతోడ మనుష్యుని కుండవలసిన సాహచర్యమును, లేక స్నేహమును బుద్ధుడు "మైత్రి" అని పిలచెనో అట్టి "మైత్రి" యే పైన జెప్పబడిన మహనీయులకు గలదు.

నేటికాలమున ఎచ్చటజూచినను అహంభావము, ధనవాంఛ, స్వజాతియొక్క ఆధిక్యమును జూపుకొనుట, అధికారవాంఛ మొదలగునవి ప్రబలియున్నవి. ఇన్నియుండిన దేశమందు అశాంతియున్నదనగా నాశ్చర్యము లేదు. స్వాతంత్ర్యభావపూరితులైన హైందవులకిప్పుడు విసుగువిరామములు డేకున్నవి. స్వాతంత్ర్యసంపాదనమునకై అహంభావమెన్నడును మంచి మార్గము కాజాలదు. తపోభ్యాసముచేత ఆధ్యాత్మికజీవితము నడపుటయే స్వాతంత్ర్య సంపాదనమునకు మంచిమార్గము, "మైత్రి" యనగా మనసహచరులందఱితోడను లేక ప్రపంచమంతటితోడను ఒకటిగా కలిసియుండు భావమే కాని వేరుగాదు. మన నాగరకత ఎంతవరకు యిట్టిభావముపై నాధారపడియుండదో అంతవరకది ప్రజాపక్షముగ నుండజాలదు.

ప్రపంచములోని వివిధజాతులు క్రీస్తుచెప్పినబోధను మరచియున్నవి. సర్వమానవ సమానత్వభావమును ఆజాతులన్నియు తమ హృదయములనుండి తీసివేసినవి. కనుకనే ప్రపంచమునందు దేశమునకొక్కొక్క ప్రత్యేక జాతీయత ఏర్పడియున్నది. మన దేశాభిమానమంతయు అహంకారభావముతో నిండియున్నది. మన నగరములన్నియు చీకాకుగానున్నవి. అవి మైత్రి భావమును పెంపొందింపలేవు. ప్రతిజాతియును దనకు ప్రపంచజ్ఞానము గల

దని గర్వించుచున్నది. కాని ఆత్మజ్ఞానముమాట మరచిపోయినది. ఏదేశమైనను తనయొక్క అంతరాత్మను పోగొట్టుకొని ప్రపంచమంతయు జయించినను ప్రయోజనమేమి? ఇట్టి ఆత్మజ్ఞానమును మరచినందువలననే ఏదేశము జూచినను కలతజెందియున్నది. మనఅందఱిలోను పరమేశ్వరుడొక్కడే యుండి ప్రకాశించుచున్నాడు. విశ్వాసము లేకున్నచో నేటికాలమునందుగల స్వాతంత్ర్య, శాంతివిషయిక సమస్యలు పరిష్కరింపబడనేరవు. అందఱిలో ప్రకాశించువాడు పరమేశ్వరుడొక్కడేయను విశ్వాసము హిందూదేశములో పూర్వమొకప్పుడు గాఢముగనుండెను. అప్పటి హిందూదేశము అత్యున్నతస్థితిని వహించియుండెను. ఆవిశ్వాసము యిప్పుడు పోయినది. వర్ణాధికుడైన వానిచేత శూద్రుడు అణగద్రొక్కబడుచున్నాడు. జాతిసంఘర్షణ మేర్పడినది. హిందూదేశపు రాజకీయ ఐకమత్యము విడిపోయినది. కనుక హిందూదేశము పతితమైనది. వివిధజాతిసమ్మేళనవిషయము గాని, నిమ్నజాతుల విషయముగాని యింకను పరిష్కారము కాలేదా?

మనము జాతిభేదములను యింకను పాటించుచున్నచో హిందూదేశమున్నతస్థితికి రానేరదు. శాశ్వతుడైన పరమేశ్వరుడొకడే యనియు ఆతడే జాతికి జెందియుండలేదనియు మనపురాతనార్యులు బోధించియున్నారు. వివిధజాతులు సోదరభావముతో నాగరకతను పెంపొందించుకొనుటయే యిప్పుడు ప్రపంచమునకు కావలసియున్నది. మనుష్యుడు ఒకరితోపోట్లాడు జీవికాదనియు ఆత్మరాజ్యములోని పౌరుడనియు ప్రపంచజాతులన్నియు గ్రహింపవలసియున్నది. ఇప్పటి నాగరకతయొక్క యుద్దేశములన్నియు భిన్నముగనున్నవి. అవి వర్తకధనములకు సంబంధించియున్నవి. సత్యము నాచరించుటకంటె స్వప్రయోజనమే మిన్నగా జూడబడుచున్నది. నీతిమార్గముకంటె కార్యసాధన చతురత్వమే ఎక్కువగా గ్రహింపబడుచున్నది. వివిధజాతులయొక్క హృదయకల్మషములు పోయినగాని ప్రపంచము కుదుటబడి నూతననాగరకత బయలుదేఱదు. యూరపుదేశము అనేకవిధముల నభివృద్ధి జెందినది. కాని బుద్ధుడుజెప్పిన "మైత్రి" అనుభావము అనగా మానవాత్మ

సమ్మేళనములేక ఆత్మరాజ్యసందర్శనము లేనిచో ఆగొప్పదనమంతయు వ్యర్థమగును. వేదముల కాలమునకుసంబంధించిన ఋషులు మొదలుకొని నేటికాలపు కేశవచంద్రుని వరకును హిందూదేశపు ప్రవక్తలనేకులు మానవాత్మసంయోగములేక అందరలోను యీశ్వరుడొక్కడే యుండి ప్రకాశించునను విషయమునుగూర్చి నొక్కిచెప్పియున్నారు. ఇట్టి జ్ఞానమెన్నడు పోయినదో హిందూదేశమప్పుడే తన గొప్పతనమును గోల్పోయెను. మనమిక ముందెట్లు నడతుమో చూచుటకు మనభావికాలము మనవంక నెదురుచూచుచున్నది. హిందూదేశమిక తనవిధిని తాను నెరవేర్చుకొనునా? రాజకీయాభివృద్ధికై గాని యితరమైన గొప్పదనములకై గాని హిందూదేశము ప్రయత్నించునపుడు ఆత్మస్వాతంత్ర్యముయొక్క సత్యస్వరూపమును తాను వెల్లడింపవలసియున్నది. అనేక యుగములక్రిందట దీనినిగూర్చి మనఋషులు, బుద్ధుడు, యేసుక్రీస్తు మొదలగువారందఱు చెప్పియున్నారు. ఈవిషయమును గ్రహించి కృషిసల్పినచో హిందూదేశమునకును, ప్రపంచములోని యితర జాతులకును శ్రేయస్సు చేకూరును.

వందేమాతరం.

ఇండియా ప్రింటింగ్ ముద్రాక్షరశాలయందు ముద్రింపబడినది.

మా ప్రచురిత గ్రంథ రాజములు.

1. పుష్పాంజలి (అధునిక కవి విరచిత భావగీతములు.)

గీతముల చదువుచున్న శ్రీకృష్ణుని మురళీగానమును వినుచున్నట్లే యుండును. అందలి మాటలు తేనియ తేటలు. వాని నడకలు రాజహంస యొయ్యారములు. రండు! రండు! పుష్పాంజలి గైకొండు! మీ కంఠంబుల కుసుమమంజరులతోడ నలంకరింపుడు. మీ మానసముల సుధాధారలతో నింపివేయుడు. మంచి ఫెదర్ వైటు కాగితములపై కడురమణీయముగ ముద్రించబడి యున్నది. వెల రు. ౧-౮-౦.

---

2. భారతస్వాంతంత్ర్యము. (ఆండ్రూసు విరచితము.)

కేవలము ఋషివలె సంచరించుచు మానవసేవ జేయు నిమిత్తమై తన జీవితకాలము నంతటిని వినియోగించుచున్న ఆండ్రూసుగారిందు భారతదేశమునకు సత్వరసర్వస్వాతంత్ర్యావశ్యకతను నిరూపించుచు వ్రాసియున్నాడు. వెల ౦-౬-౦.

---

3. స్వతంత్రజీవనము. (సుధాకర కవి విరచితము.)

స్వాతంత్ర్యమునకై భారతీయులందరును పోరుసల్పుచుండుతరి, నిజమగు స్వాతంత్ర్యమన నెద్దియో కనుగొనుటకీ గ్రంథము తోడ్పడును. స్వేచ్ఛలేని జీవనము జీవనమే కాదని గ్రంథకర్త బహుచక్కగ నిరూపించియున్నాడు. ప్రకృతియందున్న స్వేచ్ఛాస్వరూపమును జెప్పుచు, మానవుని స్వాతంత్ర్యజీవనము పరమోత్కృష్టమైనదనియు, స్వేచ్ఛ శారీరికమనియు, స్వాతంత్ర్యము ఆత్మపరమనియు సహేతుకముగ జూపబడియున్నది. వెల రు. ౦-౮-౦.

---

4. ఆంధ్రమాత (రాజకీయనాటకము)

ప్రస్తుత రాజకీయపరిస్థితులన్నియు ఇందు బహుచక్కగ వర్ణింపబడియున్నవి. వెల రు. ౧-౦-౦.

5. తిలకుశతకము (ఉత్సాహాపూరితవృత్తశతము)

లోకమాన్యుడయి భారతీయుల గమ్యస్థానము జేర్ప కాయకష్టములకోర్చి భారతమాత సేవజేసిన తిలకుగారిపైనిందు నూట ఎనిమిది చక్కని పద్యములుగలవు. శైలి మధురముగ నున్నది. రు. ౦-౪-౦.

---

6. గాంధిమహాత్ముని హైందవస్వరాజ్యము.

ఈ గ్రంథము చదివిన గాంధి మహాత్ముని నిర్మల తత్వము సుబోధకరమగును. గాంధిమహాత్ముడు ప్రపంచమునందుండు దురాశాపిశాచముల పాఱదోలి శాంతిని నెలకొల్పుటకు హైందవుల ధర్మమును చక్కగ చెప్పియున్నాడు. శ్రీయుత గాడిచెర్ల హరిసర్వోత్తమరావుగారిచే నాంధ్రీకరింపబడినది. ౦-౮-౦

---

7. ఆశియాఖండ విజ్ఞానరహస్యము (వాస్వాని విరచితము)

వాస్వానిగారు గాంధి యంతటి మహామహుడనియు, పండితోత్తముడనియు, జగద్విఖ్యాతము. ఈపోత్తమందు ప్రాచ్యుల ఔన్నత్యము కడురమణీయంబుగ వర్ణింపబడియున్నది. పాశ్చాత్యులే నాగరీకతకలవారను మిథ్యావాదుల యంధకార

మును బాపుట కీపొత్తమెంతయు సహకారిగాగలదు. ప్రతివారును జదువవలసిన గ్రంథముగాన దీనివెల సరసముగా నుంచినారము. వెల రు. ౦-౮-౦.

---

8. నిరాకరణోద్యమతత్వము (ఆండ్రూసు విరచితము)

ఋషిపుంగవుడగు ఆంద్రూడు మహనీయుడు నిరాకరణోద్యమము భారతీయులకు శరణ్యమని ఋజువుపఱచుచు ఆంగ్లేయమిత్రుని కొకనికి వ్రాసిన యుత్తరము లిందుగలవు. గాంధిమహాత్ముని గుణగణంబుల నీయాంగ్లేయుడు బాగుగ శ్లాఘించియున్నాడు. వెల. ౦-౬-౦.

---

9. రాణి లక్ష్మీ భాయి.

1857 సంవత్సరమునందు జరిగిన సీపాయి కలహములో నీ భారత వనితామణి తనరాజ్యము నపహరించిన ఆంగ్లేయులతో నెట్లు పోరుసలిపి తన యసమాన ధైర్య, శౌర్య, సాహసములను వెల్లడించెనో ఇందు వర్ణింపబడి యున్నది ౦-౪-౦.

స్వరాజ్యరథము. (రామానుజరావుగారి రాజకీయనాటకము.)

ఇందలి పద్యములు అతిమనోహరములును, ప్రజలను యుత్సాహపూరితులునుగా జేయునట్టి శక్తిగల్గినట్టివి. రెండు ముద్రణము లయిపోయి మూడవ ముద్రణము వేయించినారము. నాటకప్రదర్శనము నధికారులు బహిష్కరించుటచే ఈ నాటకముయొక్క విలువను ద్విగుణీకరించిరి. ప్రతియాంధ్రుడును చదివి ఆనందించవలసిన నాటకరాజము. వెల ౦-౮-౦.

ఉపేంద్ర ప్రచురణాలయము.

౧౭, నారాయణమొదలి వీధి, మద్రాసు.

ఆంధ్రదేశమున ప్రకటింపంబడు రాజకీయ గ్రంథముల నన్నింటిని ఒకచోట కేంద్రీకరించి పాఠకులకు పుస్తకములు సులభలభ్యములజేయుటయు, ఆంధ్రమున నూతన రాజకీయ గ్రంథములను ప్రచురించి యాంధ్రమాత సేవజేయుటయే మాముఖ్యోద్దేశము. ఆంధ్రులకు రాజకీయగ్రంథము లేవి కావలయునన్నను మా ప్రచురణాలయమునకు వ్రాసిన బడయగలరు.

ఇవిగాక భారతభాగవతాది పురాణగ్రంథములును, ప్రబంధములును, దైవభక్తుల చరిత్ర గ్రంథములును, మావద్ద దొఱకును. ఇదివఱకు ప్రచురింపబడిన సంస్కృతాంధ్ర గ్రంథములన్నియు మాతావుకు వ్రాసిన బడయగలరు.

పుస్తకముల పట్టిక.

రాజకీయ నాటకములు.

		రు.	అ.	పై.
1. గాంధివిజయము	...	0	12	0
2. కలియుగప్రహ్లాద	...	0	10	0
3. గాంధిమహోదయము	...	0	8	0
4. స్వరాజ్యధ్వజము	...	0	12	0
5. పంజాబు నాటకము	...	0	12	0
6. సంస్కారిణి	...	1	0	0
7. ఆంధ్రపతాకము	...	1	0	0
8. అలీప్రభృతుల నిర్బంధము	...	0	10	0

గీతములు, కీర్తనలు.

1. సింహపురి స్వరాజ్యకోకిలము (గీతములు)	...	0	4	0
2. స్వరాజ్యసమస్య (పద్యములు)	...	0	4	0
3. భారతోద్బోధము (పద్యములు)	...	0	4	0

గాంధిగారి వచనగ్రంథములు :

	రు.	అ.	పై.
1. గాంధిగారి 'నా చెరసాల అనుభవములు' ...	0	12	0
2. టిటో ఉపదేశములు ...	0	12	0

జాతీయనాయకుల జీవిత చరిత్రములు.

1. మహాత్మగాంధిగారి సంపూర్ణజీవితము ...	1	8	0
2. అరవిందయోగిజీవితము ...	0	5	0
3. కేవరుప్రధాని (ఇటలీరాజ్యస్థాపకుడు) ...	0	6	0
4. అబలాసచ్చరిత్రరత్నమాల (బండారు అచ్చమాంబ)	1	4	0
5. అబ్రహాములింకను (హరిసర్వోత్తమరావు) ...	0	12	0
6. మహారాష్ట్ర వీరులు ...	0	6	0

రాజకీయ వచన గ్రంథములు.

1. తిలకుగారి సంపూర్ణజీవితము, ఉపన్యాసములు	2	4	0
2. భారతవస్త్రపరిశ్రమల చరిత్ర ...	0	8	0
3. స్వాతంత్ర్యసందేశము (వస్వాని) ...	0	8	0
4. మద్యపానము (ప్రతాపరెడ్డి) ...	0	10	0
5. ప్రభుత్వము (హరిసర్వోత్తమరావు) ...	0	8	0
6. స్వరాజ్యదర్పణము ...	0	8	0
7. పంజాబు కథలు ...	0	8	0
8. నిరాకరణోద్యమతత్వము (ఆండ్రూసు) ...	0	6	0
9. చిత్తరంజనదాసుగారి సంపూర్ణజీవితము : గీతములు	0	8	0

రాబోవు గ్రంథములు.

(ఒక మాసములో తయారగును.)

1. చిత్తరంజన దాసుగారిజీవితము: ఉపన్యాసములు	1	4	0
2. హైందవజాతీయ పరిణామము (కాంగ్రెసు మహాసభయొక్క సంపూర్ణచరిత్ర) ...	1	8	0
3. అసహాయోద్యమము (గో. వెంకటసుబ్బయ్యము)	1	8	0

కావలసినవాటికి వ్రాసినవెంటనే పంపగలము.

ఉపేంద్ర ప్రచురణాలయము.

౧౭, నారాయణ మొదలి వీధి, మద్రాసు.

ఆంధ్రదేశమున ప్రకటింపంబడు రాజకీయ గ్రంథముల నన్నింటిని ఒకచోట కేంద్రీకరించి పాఠములకు పుస్తకములు సులభలభ్యములు జేయుటయు, ఆంధ్రమున నూతన రాజకీయ గ్రంథములను ప్రచురించి యాంధ్రమాతసేవజేయుటయే మా ముఖ్యోద్దేశము. ఆంధ్రులకు రాజకీయగ్రంథము లేవికావలయు నన్నను మాప్రచురణాలయమునకు వ్రాసిన బడయగలరు.

ఇవిగాక భారత భాగవతాది పురాణగ్రంథములును, ప్రబంధములును, దైవభక్తుల చరిత్ర గ్రంథములును, మావద్ద దొఱకును ఇదివఱకు ప్రచురింపబడిన సంస్కృతాంధ్ర గ్రంథములన్నియు మాతావుకు వ్రాసిన బడయగలరు.

టైటిల్ పేజి మాత్రము
అమెరికన్ డైమండు ముద్రాక్షరశాలయందు ముద్రింపబడినది.

END OF
TITLE